
నందికొట్కూరు మండలం బ్రాహ్మణకొట్కూరు వద్ద హంద్రీనీవా పంపింగ్ స్టేషన్ (పీఎస్-2) నుంచి 8 పంపులు ద్వారా కాలువకు కృష్ణాజలాలు

8 పంపుల ద్వారా
హంద్రీనీవాకు నీటి విడుదల

- 2,720 క్యూసెక్కులు లిఫ్ట్
- కాలువను పరిశీలించిన సీఈ నాగరాజు

కర్నూలు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ జీవనాడి హంద్రీనీవా కాలువకు ఇరిగేషన్‌అధికారులు నీటి విడుదలను క్రమక్రమంగా పెంచుతున్నారు. శుక్రవారం మరో పంపు పెంచి నంద్యాల జిల్లా బ్రాహ్మణకొట్కూరు సమీపంలో హంద్రీనీవా పంపింగ్ స్టేషన్ (పీఎస్-2) నుంచి 8 పంపుల ద్వారా 2,720 క్యూసెక్కులు ఎత్తిపోస్తున్నారు. హంద్రీనీవా ప్రాజెక్టు అనంతపురం సీఈ నాగరాజు, కర్నూలు సర్కిల్-1 ఎస్ఈ నాగరాజు, ఈఈ ప్రసాద్‌రావుతో పాటు ఇంజనీర్లు కాలువను పరిశీలించారు. కాలువ ప్రవాహ సామర్థ్యం 3,850 క్యూసెక్కులకు డిజైన్ చేశారు. 12 పంపులు ఏర్పాటు చేశారు. 2012లో కృష్ణాజలాలు ఎత్తిపోతలు చేపట్టినా 1,800 నుంచి 2 వేల క్యూసెక్కులకు మించి ఎత్తిపోయలేని పరిస్థితి ఉండేది. సీఎం చంద్రబాబునాయుడు సారథ్యంలో కొలువుదీరిన కూటమి ప్రభుత్వం ఫేజ్-1లో 3,850 క్యూసెక్కులు ప్రవాహానికి వీలుగా రూ.690 కోట్లతో విస్తరణ పనులు చేపట్టి దాదాపుగా పూర్తి చేశారు. ఈ నెల 17న సీఎం చంద్రబాబు మాల్యాల వద్ద కృష్ణమ్మకు జలహారతి ఇచ్చి కృష్ణా జలాలు ఎత్తిపోతలు ప్రారంభించారు. ఇంజనీర్లు క్రమక్రమంగా 8 పంపులకు పెంచి 2,720 క్యూసెక్కులు ఎత్తిపోస్తున్నారు. 12 పంపులతో పూర్తిస్థాయిలో నీటిని తీసుకోవడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. కృష్ణగిరి మండలం అలంకొండ నుంచి మద్దికెర మండలం బురుజుల గ్రామం వరకు హంద్రీనీవా కాలువను సీఈ నాగరాజు, ఎస్ఈ పాండురంగయ్య, ఈఈ ప్రసాద్‌రావు సహా డీఈఈ, ఏఈఈలు పరిశీలించారు. 3,850 క్యూసెక్కులు నీటిని ఎత్తిపోస్తే సాఫీగా నీటి ప్రవాహం ఉంటుందా..? సింగిల్‌లైన్ రోడ్డు బ్రిడ్జిల వద్ద ఏమైనా సమస్యలు తలెత్తుతాయా? పంపింగ్ స్టేషన్ల వద్ద ఉన్న ఇబ్బందులు తదితర అంశాలను పరిశీలించారు. ప్రభుత్వ సంకల్పం సాకారం చేసే దిశగా పూర్తిస్థాయిలో కృష్ణా జలాలు తీసుకోవడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని, క్షేత్రస్థాయిలో ఇంజనీర్లు అప్రమత్తంగా ఉన్నారని సీఈ నాగరాజు 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు.


కాలువను పరిశీలిస్తున్న సీఈ నాగరాజు, ఎస్ఈ పాండురంగయ్య బృందం

రుణాలు వంద శాతం వసూళ్లు చేయాలి
డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి

పాణ్యం, జూలై 25(ఆంధ్రజ్యోతి): స్త్రీనిధి, ఉన్నతి రుణాలను వందశాతం వసూళ్లు చేయాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి సూచించారు. పాణ్యంలోని కమ్యూనిటీ మేనేజ్‌మెంట్ శిక్షణ కేంద్రంలో పీడీ ఆధ్వర్యంలో 29 మండలాల ఏపీఎంలు, ఎల్‌సీలతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ సంస్థాగత నిర్మాణం చేపట్టాలన్నారు. గ్రామ, మండల సంఘాల ఆడిటింగ్ సక్రమంగా నిర్వహించాలన్నారు. లోకోస్ యాప్ అప్‌డేషన్, మొబైల్ బుక్ కీపింగ్ 2.0, స్వయం సహాయక సంఘాల సభ్యుల ఫేస్ రికగ్నైజ్, సమావేశాల స్థలం జియో ట్యాగింగ్, మైక్రో క్రెడిట్ ప్లాన్ బ్యాంకు మేనేజరు అప్రూవల్, బ్యాంకు రుణాల రికవరీ, ఆజీవిక గ్రామీణ ఎక్స్‌ప్రెస్, తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ అంశాలపై ఈనెల 31 నాటికి పురోగతి సాధించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీపీఎం హనుమాన్‌నాయక్, రంగారావు, సుధాకర్‌రావు, నంద్యాల ఏరియా కోఆర్డినేటర్ ప్రసాద్, బ్యాంకు లింకేజీ విభాగం నిర్వాహకుడు ఎల్లయ్య, స్త్రీనిధి ఏజీఎం, ఉన్నతి కో-ఆర్డినేటర్ శివచెన్నరాయుడు, 29 మండలాల ఏరియా కో-ఆర్డినేటర్లు, ఎల్‌సీలు పాల్గొన్నారు.

అడవుల సంరక్షణలో నిర్లక్ష్యం వద్దు
డిప్యూటీ డైరెక్టర్ అనురాగ్‌మీనా


పరిశీలిస్తున్న అనురాగ్‌మీనా

రుద్రవరం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): అడవుల సంరక్షణలో నిర్లక్ష్యం వద్దని ఫారెస్టుశాఖ డిప్యూటీ డైరెక్టర్ అనురాగ్‌మీనా అన్నారు. శుక్రవారం రేంజ్ పరిధిలోని బోరింగ్ బేస్‌క్యాంపును ఆయన సందర్శించారు. ప్రొటెక్షన్ వాచర్లతో అటవీ సంరక్షణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్విరాన్‌మెంట్ చెక్‌పోస్టు వివరాలను కూడా అడిగి తెలుసుకున్నారు. రుద్రవరంలో నర్సరీని పరిశీలించారు. మొక్కలు పెంపకం త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. నిర్లక్ష్యం చేయకూడదన్నారు. ఆయన వెంట ఇన్‌చార్జి రేంజర్ ముర్తుజావలి, సిబ్బంది ఉన్నారు.

శ్రీశైలం.. భక్త జనసంద్రం

- వైభవంగా స్వామిఅమ్మవార్లకు ఊయలసేవ
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు


శ్రీశైలంలో భక్తుల రద్దీ

నంద్యాల కల్చరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం క్షేత్రం భక్త జనసంద్రమైంది. శ్రావణ మాసం శుక్రవారం సందర్భంగా మల్లికార్జునభ్రమరాంబిక స్వామి అమ్మవార్ల దర్శనం కోసం అధిక సంఖ్యలో భక్తులు శ్రీశైలానికి తరలివచ్చారు. లోక కల్యాణం కోసం శ్రీశైల క్షేత్ర గ్రామదేవత అయిన అంకాళమ్మకు ఉదయం అభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం పుష్పాలంకరణ, కుంకు మార్చనలు చేశారు. లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు అంకాళమ్మ అమ్మవారికి పంచామృత అభిషేకం, హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, పుష్పోదకం, విశేషాభిషేకం అర్చనలు నిర్వహించారు.

స్వామి, అమ్మవార్లకు ఊయల సేవ...

లోకకల్యాణం కోసం అర్చకులు సేవా సంకల్పాన్ని పఠించారు. గణపతి పూజ అనంతరం స్వామిఅమ్మవార్లకు శాస్త్రోక్తంగా షోడషోపచారపూజ తరువాత ఊయలసేవ నిర్వహించారు. దేవస్థానం తరపున నిర్వహిస్తున్న ధర్మపదంలో భాగంగా ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద హైదరాబాద్ నటరాజ అకాడమీ వారి నృత్యప్రదర్శన నిర్వహించారు. మూషికవాహన, లింగాష్టకం, శివాష్టకం, మహా దేవశివ, అయుగిరినందిని, తదితర గీతాలకు, అష్టకాలకు సంతోషిణి, గాయత్రీ, ఆరాధ్య, అక్షర, మేఘన తదతరులు నృత్యప్రదర్శన చేశారు. అనంతరం హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని లాంటి కార్యక్రమాలు ఏర్పాటుచేశారు.

పోలీసుల అదుపులో ఎమ్మిగనూరు మున్సిపల్ వైస్ చైర్మన్
బెదిరింపుల కేసులో పోలీసుల విచారణ


నజీర్ అహ్మద్, మున్సిపల్ వైస్‌చైర్మన్

ఎమ్మిగనూరు జూలై 25 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఓ వ్యాపారితో జరిపిన ఆర్థిక లావాదేవీలు, బెదిరింపుల కేసులో మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహ్మద్‌ను పట్టణ పోలీసులు విచారించారు. శుక్రవారం అతడిని అదుపులోకి తీసు కున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. వివరాలు.. పట్టణానికి చెందిన హయాత్‌అలీ అనే వ్యక్తికి మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహ్మద్‌కు మధ్య ఆర్థిక లావాదేవీలు జరిగాయి. హయత్‌అలీకి రూ.17.50 లక్షలు మున్సిపల్ వైస్‌చైర్మన్ బాకీపడ్డాడు. బెదిరింపులకు పాల్పడటంతో పట్టణ పోలీసుస్టేషన్‌లో నజీర్ అహ్మద్‌పై కేసు నమోదైంది. ఈ కేసులో వైస్‌చైర్మన్‌ను విచారణ చేసేందుకు పలుమార్లు పిలిచినా హాజరు కాకపోవటంతో శుక్రవారం పట్టణ పోలీసులు నజీర్ అహ్మద్‌ను అదుపులోకి తీసుకొని 41ఏ సీఆర్‌పీ సెక్షన్ కింద నోటీసులిచ్చి విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు.

2.5 కిలోల గంజాయి స్వాధీనం

నంద్యాల టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గుట్టుగా తరలిస్తున్న రెండున్నర కిలోల గంజాయిని టూటౌన్ పోలీసులు శుక్రవారం గుర్తించారు. గంజాయి రవాణాతో విక్రయిస్తున్నారన్న పక్కాసమాచారం తెలుసుకున్న టూటౌన్ సీఐ ఇస్మాయిల్ తన సిబ్బందితో పలుచోట్ల దాడులు నిర్వహించారు. నంద్యాల పట్టణంలోని బైటిపేటకు చెందిన సురసుర వెంకటచిరు, నూనెపల్లెకు చెందిన షేక్ షాహిన్‌నూర్, ఏకలవ్య నగర్‌కు చెందిన పోరుపోయిన దుర్గాప్రసాద్‌తో పాటు మరో మైనర్‌ను అదుపులోకి తీసుకుని వారి నుంచి 2.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరితో పాటు గంజాయి సరఫరా ముఠాలో ఉన్న మరో ఐదుగురి కోసం గాలిస్తున్నారు. ఈ సందర్భంగా సీఐ ఇస్మాయిల్ మాట్లాడుతూ గంజాయి ఎవరైనా విక్రయించిన, సేవించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తల్లిదండ్రులు సైతం విద్యార్థుల పవర్తనపై నిఘా ఉంచాలని కోరారు.

పాలకొలనులో మిస్సైల్ ప్రయోగం


- యూఎల్‌పీజీ-వీ3 పరీక్షలు విజయవంతం
- దేశీయంగా సరికొత్త టెక్నాలజీతో సత్తా

7

గంజాయి రవాణాను అరికట్టాం: డీఐజీ

ఉమ్మడి జిల్లాలో మోస్తరు వర్షాలు

- భారత వాతావరణ సంస్థ వెల్లడి
- వర్షాధార పంటలకు అనుకూలం
- తెగుళ్లపై అప్రమత్తం చేస్తున్న శాస్త్రవేత్తలు



నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కర్నూలు, నంద్యాల జిల్లాల్లో శనివారం నుంచి ఈనెలాఖరు వరకు చిరుజల్లుల నుంచి అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని భారత వాతావరణ సంస్థ వెల్లడించింది. వర్షాలతో పాటు నైరుతి నుంచి పశ్చిమ దిశగా గాలులు గంటకు 10నుంచి 20 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశముందని, గాలిలో ఉదయం పూట తేమ 68 నుంచి 73శాతం, మధ్యాహ్నం 50 నుంచి 72శాతం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా గుంటూరు ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు రైతులకు పలు సూచనలు అందిస్తున్నారు. రాబోయే ఐదు రోజుల్లో చిరుజల్లుల నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశమున్నందున వర్షాధార పంటలైన వేరుశనగ, కంది, ఆముదం, పత్తి పంటలను ఆగస్టు మొదటి వారం వరకు విత్తుకోవచ్చని సూచిస్తున్నారు. పంటలకు ఆశించే తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.

వేరుశనగలో పొగాకు లద్దె పురుగులు



జూన్ రెండో పక్షంలో విత్తిన వేరుశనగ పంటకు ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు రసం పీల్చే, పొగాకు లద్దె, శనగపచ్చ పురుగులు ఆశించే అవకాశముంది. రసం పీల్చే పురుగుల ఉధృతిని గమనించడానికి వేరుశనగ పొలంలో జిగురుఅట్టలు(ఎకరానికి 10) మరియు ఫెరోమోన్‌ట్రాప్స్(ఎకరానికి 4) అమర్చుకోవాలి. పొగాకు లద్దెపురుగు, శనగపచ్చ పురుగు నివారణకు పంట విత్తిన 10 నుంచి 15రోజుల లోపు ఎకరాకు 4 లింగార్షకబుట్టలు పెట్టి మగరెక్కల పురుగులను ఆకర్షింపజేయాలన్నారు. ఎదిగిన లార్వాలకు లీటరు నీటికి ఏమామెక్టిన్‌వబెంజోయేట్ 0.4గ్రాములు, లేదా క్లోరిఫైరిఫాస్ 2.5ఎంఎల్ పిచికారి చేయాలి.



పత్తిలో రసం పీల్చే పురుగు

ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా పత్తి పంట రసం పీల్చే పురుగు ఆశించొచ్చని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. లీటరు నీటికి వేపనూనె 5.0ఎంఎల్ లేదా ఐదుశాతం వేపగింజల కషాయాన్ని పిచికారి చేయాలి.

మొక్కజొన్నలో కత్తెరపురుగు



ప్రస్తుతం మొక్కజొన్నలో కత్తెర పురుగు ఆశించే అవకాశం ఉంది. పురుగు ఉనికిని గుర్తించడానికి ఎకరాకు నాలుగు ఫిరమోన్ ఎరలు ఏర్పాటు చేయాలి. ఒక ఫిరమోన్ ఎరలో 10 పురుగులు పడినట్లయితే వెంటనే లీటరు నీటికి 5 ఎంఎల్ వేపనూనె కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. పురుగు ఉధృతిని బట్టి లీటరు నీటికి రెండు గ్రాముల థయోడికార్బ్ లేదా 0.4గ్రాముల ఇమామేక్టిన్ బెంజోయెట్ పిచికారి చేయాలి.

కొలనుభారతి అభివృద్ధికి రూ.1.20 కోట్లు

- జిల్లా దేవదాయ శాఖ అధికారి మోహన్

కొత్తపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జ్ఞానసరస్వతి అమ్మవారి క్షేత్రమైన కొలనుభారతి ఆలయ నిర్మాణ పనులకు రూ.1.20 కోట్ల నిధులు మంజూరైనట్లు జిల్లా దేవదాయ శాఖ అధికారి మోహన్ తెలిపారు. శుక్రవారం ఆయన కొలనుభారతిలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొలను భారతి అమ్మవారి ఆలయ నిర్మాణ పనులకు నిధులు లేక మధ్యలో నిలిచి పోయినట్లు చెప్పారు. దీంతో ఎమ్మెల్యే గిత్తా జయసూర్య చొరవతో ఆల యానికి చెందిన మూలధనం నుంచి రూ.20లక్షల నిధులు వెచ్చించి సీజీఎఫ్ (కామన్ గుడ్స్ ఫండ్) కింద దేవదాయ శాఖకు జమ చేసినట్లు తెలిపారు. ఇంకా రూ.4లక్షలు సీజీఎఫ్ కింద జమ చేయాల్సి ఉందని, అవి కూడా త్వరలో జమచేసి నిర్మాణ పనులు చేపడుతామన్నారు.

భూహక్కుల పరిరక్షణకు కృషి చేయండి

నంద్యాల రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా భూహక్కుల పరిరక్షణకు కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. నంద్యాల మండలం గుంతనాల గ్రామంలోని సర్వే నంబరు 14, 17 లోని భూముల మార్కెట్ విలువల వ్యత్యాసాలను సరిచేయాలని బాధితులు ఇచ్చిన వినతులను తహసీల్దార్‌తో కలిసి ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సమస్యను పరిష్కరించాలని జేసీ సంబంధిత అధికారులకు ఆదేశించారు.


స్విచ్ ఆన్‌చేసి నీటిని విడుదల చేస్తున్న మంత్రి, ఎమ్మెల్యేలు

సీమను సస్యశ్యామలం చేస్తాం

- కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్
- కృష్ణమ్మకు జలహారతి ఇచ్చిన మంత్రి, ఎమ్మెల్యేలు కోట్ల, కేఈ

7



- కూటమి వచ్చి ఏడాది దాటిన పురోగతి మందగమనం
- ఇప్పటికే ఖర్చు చేసిన రూ.601.69 కోట్లు నిరుపయోగం

కర్నూలు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పేదల నిర్మాణంలో అంతులేని జాప్యం కనిపిస్తోంది. కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆదోని, ఆలూరు, పత్తికొండ, మంత్రాలయం, పాణ్యం నియో జకవర్గాల్లో కర్నూలు, ఎమ్మిగనూరు, ఆదోని, గూడూరు మున్సిపాలిటీ పట్టణాలు, 26 మండలాల పరిధిలో పీఎంఏవై (అర్బన్, గ్రామీణ) కింద 2014-15 నుంచి 2023-24 వరకు పదేళ్లలో పేదలకు సొంతింటి కల నెరవేర్చేందుకు 53,967 ఇళ్ల మంజూరుచేశారు. ఇప్పటివరకు 50,032 ఇళ్ల నిర్మాణాలు మొదలుపెట్టారు. 29,408ఇళ్లు పూర్తి చేశామని గృహ నిర్మాణ శాఖ అధికారులు చెబుతున్నారు. వివిధ దశల్లో ఉన్న 20,711 ఇళ్లను పూర్తి చేసి పేదలకు గూడు, నీడ కల్పించాలని కూటమి ప్రభుత్వం లక్ష్యాలను నిర్దేశించింది. వాస్తవంగా గతేడాది డిసెంబరు ఆఖరిలోగా 4,422 ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించేలా టార్గెట్ ఇచ్చినా అది జరగలేదు. తాజాగా వివిధ దశల్లో ఉన్న 20,711 ఇళ్లలో 11,706 ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులతో గృహ ప్రవేశం కల్పించాలని సీఎం చంద్రబాబు ఆదేశాలతో జిల్లా కలెక్టరు పి.రంజిత్‌బాషా గృహ నిర్మాణ శాఖ అధికారులను పరుగులు పెట్టిస్తున్నారు. పలు పట్టణాల్లో ప్రభుత్వం ఇళ్లు అసంపూర్తిగా వదిలేశారు.

అసంపూర్తి ఇళ్లు.. పట్టించుకోరు పాలకులు

ఎమ్మిగనూరులో మాచాని శివన్న నగర్‌లో టిడ్కో ఇళ్ల సముదాయం పక్కనే వైసీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీ నిర్మాణం పేరిట 2,300 ఇళ్లు మంజూరు చేశారు. 1999-2004 మధ్యలో అప్పటి ఉమ్మడి రాష్ట్ర మంత్రి, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ మోహన్‌రెడ్డి పట్టణంలో పేదలకు ఒక్కొక్కరికి మూడు సెంట్లు చొప్పున ఇంటి స్థలం పట్టాలు ఇచ్చారు. 2021-22లో వైసీపీ ప్రభుత్వం ఆ పట్టాలను రద్దు చేసి జగనన్న కాలనీ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. 2,300 ఇళ్లను మంజూరు చేయడంతో పాటు నిర్మాణాలు చేపట్టారు. ఈ పనులను ఓ కాంట్రాక్టరుకు అప్పగించారు. రూ.46.88 కోట్లు ఖర్చు చేసి 2,204 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసినట్లు రికార్డుల్లో చూపించారు. కాంట్రాక్ట్ సంస్థ కేవలం నాలుగు గోడలు నిర్మించి, ఆర్‌సీ స్లాబ్ వేసి చేతులు దులుపుకుంది. రికార్డుల్లో ఇంటి నిర్మాణం పూర్తయినట్లు చూపించారు. విద్యుత్ సరఫరా ఇవ్వలేదు. స్నానపు గదులు, మరుగుదొడ్లు కూడా నిర్మించలేదు. వీటిని లబ్ధిదారుడు సొంత ఖర్చులతో ఏర్పాటు చేసుకోవాలని అంటున్నారు. లబ్ధిదారుడు రూ.1.50 - రూ.2 లక్షలకు పైగా అదనంగా భరించాలి.

మిగతా 6వ పేజీలో



నానో ఎరువులతో లాభాలెన్నో..!

వ్యవసాయం సులభతరంగా, లాభసాటిగా మార్చడానికి నూతన ఆవిష్కరణలు ఊతమిస్తాయి. ఈకోవలేనే రూపుదిద్దుకున్న నానో సాంకేతికత ఎరువుల తయారీలో సరికొత్త విప్లవానికి నాంది పలికింది. యూరియా, డీఏపీలు 'నానో ఎరువులు'గా ద్రవరూపంలో అందుబాటులోకి వచ్చాయి. రసాయనిక ఎరువుల గుళిక మందులను నివారించేందుకు ప్రభుత్వం వినూత్న ఆలోచన చేసింది. అధిక మోతాదులో యూరియా, రసాయనిక ఎరువులు వాడొద్దని, వాటి స్థానంలో నానో యూరియా, డీఏపీ వాడటంతో తక్కువ ఖర్చుతో పొలాలకు సత్తువనిస్తుందని అవగాహన కల్పిస్తున్నారు.



ఆదోని డీసీఎంఎస్ కేంద్రంలో అందుబాటులో ఉన్న నానో యూరియా

- యూరియా కొరతను తీర్చేందుకు నానో ఎరువు
- తక్కువ ఖర్చుతో పొలానికి సత్తువ
- అధిక మోతాదును నివారించేందుకు వినూత్న ఆలోచన
- గుళికలకు బదులు పిచికారి మందు

ఆదోని అగ్రికల్చర్ , జూలై 25 (ఆంధ్రజ్యోతి): నానో ఎరువులతో రైతులకు ఎన్నో లాభాలు ఉన్నాయి. మోతాదుకి మించి రసాయనిక ఎరువులు వాడి తీవ్రంగా నష్టపోతున్నారు. క్రమక్రమంగా వాటిని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం నానో యూరియా, నానో డీఏపీ పిచికారి మందును రూపొందించేందుకు కంపెనీలకు అనుమతి ఇచ్చింది. వాటిని మార్కెట్లో విడుదల చేశారు. ప్రస్తుతం వర్షాలు కురవడంతో యూరియా, డీఏపీ వంటి ఎరువులకు డిమాండ్ పెరిగింది. పది రోజులుగా జిల్లాలోని ఆదోని, ఎమ్మిగనూరు, ఆలూరు, పత్తికొండ, మంత్రాలయం ప్రాంతాల్లో యూరియా దొరకక రైతులు అవస్థలు పడుతున్నారు. చాలా మంది రైతులు అవగాహన లేక నానో యూరియా తీసుకునేందుకు మొగ్గు చూపడం లేదు.



నానో యూరియాను తీసుకెళ్తున్న రైతులు

ఖర్చు తగ్గించి..

కర్నూలు జిల్లాలో పత్తి, వేరుశనగ, వరి, ఉల్లి, మిరప, మొక్కజొన్న, కంది, పెసర, మినుము పలు రకాల పంటలను సాగు చేస్తున్నారు. అధిక దిగుబడులు సాధించేందుకు అనేక రకాల రసాయన ఎరువులను కొనుగోలు చేస్తూ పంటలకు వాడుతున్నారు. ఈఎరువులు యాభై కేజీ బస్తాల్లో ఉండడంతో వాటిని దూరప్రాంతాల్లోని పొలాల్లోకి తీసుకువెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతులు రసాయన ఎరువులను పరిమితంగా వాడడంతో పాటు ఎరువులను పొలాలకు సులువుగా తరలించేందుకు వీలుగా ఉండే నానో యూరియా, నానో డీఏపీలను వినియోగించేలా అందుబాటులో ఉంచింది. బస్తాలను మోసేపని తగ్గుతుందని సూచించినా అవగాహన లేకపోవడంతో వీటిని తీసుకెళ్లేందుకు జంకుతున్నారు. కొద్దికాలంగా నానో ఎరువులను వినియోగంతో కలిగే లాభాలపై వ్యవసాయ శాఖ రైతులకు అవగాహన కల్పిస్తోంది. కొందరు రైతులు ఇప్పుడిప్పుడే నానో ఎరువులను వాడేందుకు ఆసక్తి చూపుతున్నారు.

సులభంగా తరలించొచ్చు

మార్కెట్లో యాభై కేజీల యూరియా బస్తా ధర రూ.266, డీఏపీ యాభై కేజీల బస్తా ధర రూ. 1,350 ఉండగా కొందరు వ్యాపారులు యూరియా రూ.350, డీఏపీ రూ. 1400కు అనధికారంగా అమ్ముతున్నారు. వీటిని పొలాల వద్దకు చేర్చేందుకు అదనంగా మరో వంద రూపాయల వరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. నానో యూరియా 500 మిల్లీలీటర్లు ధర రూ. 225, నానో డీఏపీ ధర రూ.600 మాత్రమే కాక వీటిని సులభంగా తరలించవచ్చు. ఎకరానికి రెండుసార్లు పిచికారి చేసుకోవచ్చని వ్యవసాయ శాఖాధికారులు చెబుతున్నారు.

నానో ఎరువులపై అవగాహన



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నానో ఎరువులపై అవగాహన కల్పించాలని సూచించాయి. తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందే విధంగా ప్రభుత్వం నానో యూరియా, డీఏపీ పిచికారి మందులకు అనుమతించింది. నానో డీఏపీ, యూరియాను డీసీఎంఎస్ కేంద్రాలతో పాటు పలు డీలర్ల వద్ద అందుబాటులో ఉంచాం.
- జీవి సుధాకర్, మండల వ్యవసాయాధికారి, ఆదోని

జీడీపీకి నీటి విడుదల

- హంద్రీనీవా నుంచి 70, ఎల్లెల్సీ నుంచి 55 క్యూసెక్కులు
- రెండు రోజుల్లో ప్రాజెక్టుకు చేరే అవకాశం
- ఆయకట్టు రైతుల్లో ఆనందం

గోనెగండ్ల, జూలై 25(ఆంధ్రజ్యోతి): గాజులదిన్నె ప్రాజెక్టు(జీడీపీ)కి నీటిని ఇరిగేషన్ అధికారులు విడుదల చేశారు. హంద్రీనీవా నుంచి జీడీపీకి నీటిని విడుదల చేయమని రెండు రోజుల క్రితం కలెక్టర్ ఆదేశించారు. దీంతో ఇరిగేషన్ అధికారులు హంద్రీనీవా నుంచి గురువారం 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఆ నీరు ఆదివారం కానీ, సోమవారం ఉదయం ప్రాజెక్టుకు చేరనున్నట్లు జీడీపీ అధికారులు తెలిపారు. ప్రస్తుతం జీడీపీలో కేవలం ఒక్క టీఎంసీ నీరు మాత్రమే ఉంది. ఎల్లెల్సీ నుంచి గోనెగండ్ల ఎస్కేప్ చానల్ ద్వారా రోజుకు 55 క్యూసెక్కుల నీరు జీడీపీ విడుదల అవుతున్నాయి. హంద్రీనీవా, ఎల్లెల్సీనీరు వచ్చి జీడీపీని చేరుతుండటంతో ఇక తాగునీటి పథకాలైన బండగట్టు, డోన్, క్రిష్ణగిరి, లకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. వచ్చే రబీసీజన్‌కు కూడా 10వేల నుంచి 12వేల లోపు ఎకరాలు సాగునీరు అందే అవకాశాలు మెరుగుపడ్డాయని జీడీపీ ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తుంగభద్రడ్యాంలో 80 టీఎంసీల కంటే ఎక్కువ నీటిని నిలువ చేయరాదని అధికారులు ప్రకటించడంతో కర్నూలు నగరానికి వేసవి కాలంలో తాగునీరు అందించే సుంకేసుల జలాశయంలో తగినంత నీటి నిలువ ఉంచే పరిస్థితి ఉండదని తెలుస్తోంది. ఈ పరిస్థితుల్లో కర్నూలు నగరంలో ఉన్న ప్రజలకు వచ్చే వేసవిలో నీటి కష్టాలను తీర్చేందుకు గాను జీడీపీలో నీటిని నిల్వ చేసుకొని అవసరమైన సమయంలో వినియోగించుకోవడం కోసం ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిసింది.



గాజులదిన్నె ప్రాజెక్టులో నిల్వ ఉన్న ఒక టీఎంసీ నీరు

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష

- 188 మంది విద్యార్థులు హాజరు
- నలుగురు గైర్హాజరు
- పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన జేసీ



సెయింట్ క్లారెట్ పాఠశాలలో పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జాయింట్ కలెక్టర్ బి.నవ్య

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెయింట్ క్లారెట్ ఇంగ్లిష మీడియం పాఠశాలలో శుక్రవారం ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎంజేపీఏపీ బీసీడబ్ల్యూఆర్(మహాత్మా జ్యోతిబా పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాల)లో 6, 7, 8 తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీకై నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్షా కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ బి.నవ్య పర్యవేక్షించారు. మొత్తం విద్యార్థులు 192 మందికి గానూ 188 మంది హాజరు కాగా, నలుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఈ పరీక్షలు మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు కొనసాగింది. పరీక్షా కేంద్రాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్, గురుకులాల కో-ఆర్డినేటర్ పరిశీలించారు.

ఐదేళ్ల పాలనలో అరాచకాలే

- కల్తీతో మద్యం తాగి మతిభ్రమించిన వైసీపీ నాయకులు
- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్
- పత్తికొండలో 'తొలి అడుగు'

పత్తికొండ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ఐదేళ్ల పాలన అరాచకాలతోనే కొనసాగిందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ విమర్శించారు. శుక్రవారం పత్తికొండ నియోజకవర్గ పరిధిలోని బోయబొంతిరాళ్ల గ్రామంలో ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబుతో కలసి ఆయన 'తొలి అడుగు'లో పాల్గొన్నారు. గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. పథకాలు అందుతున్నాయా.. లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. మంత్రి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను ఒక్కొక్కటిగా ప్రజలకు అమలు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమంపైనే ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేకనే వైసీపీ కుట్రలు పన్నుతోందని విమర్శించారు. 6లక్షల కోట్ల పెట్టుబడులను తీసుకువచ్చేందుకు చంద్రబాబు, పవన్, లోకేశ్ నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. వైసీపీ పాలనలో కల్తీ మద్యం అమ్మిన వైసీపీ నాయకులు ఆ మద్యం దాచుకుని పగలు రాత్రి తాగుతూ మతిభ్రమించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. వైఎస్ జగన్ మరింత రెచ్చిపోయి చంపుతాం, నరుకుతాం అంటూ మాట్లాడుతున్నారన్నారు. అహంభావం, అహంకారాలే వైసీపీ పతనానికి కారణమని, ఆ పార్టీ నాయకులు మాట్లాడిన బూతు పురాణాలకు ప్రజలు బుద్ధి చెప్పారన్నారు.



బోయబొంతి రాళ్లలో మహిళతో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

ఇళ్లు.. ఎన్నేళ్లు..!



తాగునీటి కోసం ఇలా ట్యాంకులు కట్టి వదిలేయడంతో ఊడిపోతున్న కొళాయిలు

5వ పేజీ తరువాయి

దీనికితోడు తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ వంటి సౌకర్యం లేకపోవడంతో పేదలు ఆసక్తి చూపడం లేదు. ఫలితంగా మందుబాబులకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. ఆదోని శివారులో డాణాపురం దగ్గర ఆదోని పట్టణ ప్రజలకు 6,495 ఇళ్ల నిర్మాణాలు మొదలు పెట్టి 4,286 ఇళ్ల పూర్తి చేశామని రికార్డుల్లో చూపుతున్నారు. ఇప్పటికే రూ.100.14 కోట్లు ఖర్చు చేశారు. అక్కడ కూడా నాలుగు గోడలు, ఆర్‌సీసీ స్లాబ్ వేసి వదిలేశారు. ఎమ్మిగనూరు, ఆదోని పట్టణాల్లో ఒక్కటే కాదు.. కర్నూలు నగరం సహా ముప్పాతిక శాతం గ్రామాల్లో ఇదే పరిస్థితి ఉంది.

పీఎంఏవై (అర్బన్, గ్రామీణ) ఇళ్ల పురోగతి వివరాలు

వివరాలు	అర్బన్	గ్రామీణ	మొత్తం
మంజూరు చేసిన ఇళ్లు	39,440	14,527	53,967
నిర్మాణాలు మొదలైనవి	39,410	10,622	50,032
పూర్తైన ఇళ్లు	24,766	4,642	29,408
వివిధ దశల్లో ఉన్నవి	14,731	5,980	20,711
చేసిన ఖర్చు (రూ.కోట్లల్లో)	533.58	68.11	601.69

ఇసుక గూళ్లు!

గత జగన్ ప్రభుత్వ హయాంలో ఆప్షన్-3 కింద ఆదోని, ఆలూరు, మంత్రాలయం, ఎమ్మిగనూరు పట్టణాల్లో దాదాపు 10,138 ఇళ్ల నిర్మాణాలను కాంట్రాక్టర్లకు అప్పగించారు. 85 శాతానికి పైగా పనులు పూర్తి చేశామని ఆ ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన కాంట్రాక్ట్ సంస్థలు చెబుతున్నాయి. ఆ సంస్థలకు రూ.77-80 కోట్లకు పైగా బిల్లులు చెల్లించారు. లబ్ధిదారులు కుటుంబంతో నివాసం ఉండేదుకు వీలుగా ఒక్క ఇల్లు కూడా నిర్మాణం చేయలేదు. నాలుగు గోడలు కట్టి, ఆర్‌సీసీ స్లాబ్ వేసి, బయట గోడలకు ఒక్కటే సిమెంట్ ప్లాస్టింగ్ చేసి వదిలేశారు. ఇళ్ల నిర్మాణంలో నాణ్యమైన సిమెంట్ ఇటుకలు వాడలేదని తెలుస్తోంది. నాణ్యతా ప్రమాణాలపై పలు ఆరోపణలు ఉన్నాయి. ఆదోనిలో ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారధి ఇళ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి నాణ్యతపై ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని ఎమ్మెల్యేగా గెలిచిన మొదట్లో చెప్పిన ఆయన ఇప్పటికీ చర్యలు లేవు. థర్డ్‌పార్టీ క్వాలిటీ కంట్రోల్ ఇంజనీర్లతో తనిఖీ చేయించాలని, నాణ్యతాప్రమాణాలు విస్మరించినట్లు తేలితే కాంట్రాక్ట్ సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

లక్ష్యం మేరకు పురోగతి

కర్నూలు జిల్లాలో పేదలకు 53,967 ఇళ్లు ప్రభుత్వం మంజూరు చేసింది. 50,032 ఇళ్లు నిర్మాణాలు మొదలు పెట్టి 29,408 ఇళ్లను పూర్తి చేశాం. వివిధ దశల్లో ఉన్న ఇళ్లలో 11,706 ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. కర్నూలు కలెక్టరు పి.రంజిత్‌బాషా క్రమం తప్పకుండా పురోగతిపై సమీక్షిస్తున్నారు. గడువులోగా నిర్మాణాలు పూర్తి పేదలకు అప్పగిస్తాం.
- చిరంజీవి, ప్రాజెక్ట్ డైరెక్టర్, గృహ నిర్మాణ శాఖ, కర్నూలు

పెన్షన్ వ్యాలిడేషన్ చట్టాన్ని రద్దు చేయాలి

- ఏఐబీఎస్ఎన్ఎల్ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు
- కర్నూలులో ఉద్యోగుల ధర్నా



నిరసనలో మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

కర్నూలు న్యూసిటీ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పెన్షన్‌దారులకు వ్యతిరేకంగా మార్చి 2025 తేదీ ఆర్థిక బిల్లులో ప్రవేశపెట్టిన పెన్షన్ వ్యాలిడేషన్ చట్టాన్ని రద్దు చేయాలని ఆల్ ఇండియా బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఏ.రామాంజనేయులు డిమాండ్ చేశారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీనివాసనగర్ టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ వద్ద మానవహారం నిర్వహించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ ఈ చట్టంతో పాత, కొత్త పెన్షన్‌దారులకు వేరు చేస్తూ పెన్షన్ రివిజన్ 2026లో రిటైర్ అయ్యే వారికి వర్తించే విధంగా, డిసెంబరు 2025 కంటే ముందుగా రిటైర్ అయ్యేవారికి వర్తించదని చట్టం చేయడం జరిగిందన్నారు. వ్యాలిడేషన్ చట్టాన్ని రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐబీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి జే.వెంకట రమణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి పి.రామదాసు, ఏఐబీడీ పీఏ అసోసియేషన్ నాయకులు యాకోబు, మహేశ్వర రావు, ఎస్ఎన్‌పీడబ్ల్యూఏ నాయకులు జే.వెంకటరమణ, బి.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

సారా విక్రయిస్తే పీడీయాక్ట్


ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్

నంద్యాల టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): సారా విక్రయిస్తే పీడీయాక్ట్ నమోదు చేస్తామని ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్ స్పష్టం చేశారు. శుక్రవారం నంద్యాలలోని ఎక్సైజ్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. పీడీ యాక్ట్ నమోదు చేసినా మార్పురాని వారి వివరాలను వెల్లడించారు. పాణ్యం మండల కేంద్రానికి చెందిన మానిపాటి రాజు అనే వ్యక్తి సారా విక్రయిస్తూ అనేక సార్లు పట్టుబడడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు అరెస్ట్ చేసి సెంట్రల్ జైల్‌కు పంపామన్నారు. జిల్లాను నాటుసారా రహితంగా మార్చడానికి నవోదయం.2 కార్యక్రమాన్ని అన్ని శాఖలతో కలిసి పని చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని 199 గ్రామాలకు గానూ 71 గ్రామాలను సారా రహిత గ్రామాలుగా చేసినట్లు తెలిపారు. త్వరలో మరో 30 గ్రామాలను మార్చుతామన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకు 48,850 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసి 8,770 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సారా విక్రయిస్తున్న 458 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. సారా విక్రయిస్తూ మార్పు రాని వారిపై బైండోవర్ కేసులు నమోదు చేసి రూ.3.75 లక్షలు జరిమానా వసూలు చేశామన్నారు. ఈ సమావేశంలో డీటీఎఫ్ లక్ష్మణదాసు, సీఐ కృష్ణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

కోడెల రాముడు



బల రాముడు



అడవి రాముడు

- ఆ రైతుకు ఎద్దులపై మమకారం
- పందెం కోడెలను పెంచుతున్న శ్రీరాములు

కోడుమూరు రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఆ రైతుకు ఎద్దులంటే ప్రాణం. వాటి పోషణలో ఖర్చుకు వెనుకంజ వేయడం లేదు. కన్నబిడ్డల కంటే అపురూపంగా ఆ ఎద్దులను పెంచుకుంటున్నాడు కోడుమూరు మండలంలోని క్రిష్ణాపురం గ్రామానికి చెందిన శ్రీరాములు అనే రైతు. గత 15 ఏళ్ల నుంచి కోడె దూడలను పెంచుతున్నాడు. ఈ రైతుకు ఐదెకరాల సొంత పొలం ఉంది. దీనికి అదనంగా మరో 20 ఎకరాలను కౌలుకు చేస్తున్నాడు. వ్యవసాయ పనుల్లో కోడె దూడలను వినియోగిస్తూనే, రాతిదూలం లాగే పోటీలకు తరలిస్తున్నాడు. రైతు శ్రీరాములు గతంలో కొనుగోలు చేసిన దూడల్లో ఒకదానికి బలరాముడు, మరోదానికి అడవి రాముడు అని పేర్లు పెట్టి పిలుస్తున్నాడు. ఇందులో బలరాముడును రూ.1.80 లక్షలకు కొనుగోలు చేయగా అడవి రాముడును రూ.లక్షకు కొనుగోలు చేశాడు. ఇప్పుడా కోడెలు రూ.13 లక్షలు, రూ.10లక్షలకు విక్రయించాలని అడుగుతున్నా.. వాటిని విక్రయించేందుకు రైతు శ్రీరాములు అమ్మడానికి ఇష్టపడటం లేదు. పందెం పోటీలకు తలపడుతున్న కోడెదూడలకు గ్రాసంతో పాటు దాణా, ఉలవలు, ఖర్జూరం, బాదం, బీట్‌రూట్, క్యారెట్, ఎండుకొబ్బరి, బీన్స్ వంటి పోషకాహారం అందిస్తున్నాడు. వాటి పోషణకు నెలకు దాదాపు రూ.20వేలు ఖర్చు చేస్తున్నాడు. పందెం పోటీల్లో గెలుపొందిన నగదుతో పాటు సొంతంగా ఖర్చు చేస్తూ ఎద్దులను కంటికి రెప్పలా చూస్తున్నాడు.



ఎద్దులపై మమకారం ఇప్పటిది కాదు

మాతాతల కాలం నుంచి పశుపోషణ చేస్తున్నాం. వ్యవసాయంలో ఎద్దుల సహకారానికి ఏమిచ్చి రుణం తీర్చుకోగలం. వారసత్వంగా పశువుల పెంపకంపై ఇష్టం ఏర్పడింది. గత 15 ఏళ్ల నుంచి పందెం ఎద్దులను పెంచుతున్నాను. పోటీల్లో సాధించే విజయం ఎంతో గర్వకారణంగా నిలుస్తోంది. నాతో పాటు గ్రామానికి కూడా మంచి పేరు వస్తోంది. - శ్రీరాములు, క్రిష్ణాపురం

గంజాయి రవాణాను అరికట్టాం

- పోలీస్ శాఖపై నిందలు వేస్తే సహించం
- కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఐజీ కోయ ప్రవీణ్

కర్నూలు క్రైం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపి దాదాపుగా నివారించగలిగామని కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ అన్నారు. శుక్రవారం కర్నూలు నగరంలోని తన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. గత కొద్ది రోజులుగా పోలీసు డిపార్టుమెంట్‌ను, పోలీసు అధికారులను వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకుని.. కొన్ని పత్రికా మాధ్యమాలలో దూషించడం, తప్పుడు కథనాలు రాయడం సరికాదన్నారు. తమపై, పోలీసుశాఖపై వస్తున్న అసత్యప్రచారాలపై స్పందించకపోతే ప్రజలు అవే నిజమని భావిస్తారన్నారు. అందుకే తాను మీడియా ముందుకు వచ్చానని తెలిపారు. తాను విశాఖపట్నం జిల్లా ఎస్పీగా 2014-16 మధ్య కాలంలో పనిచేశానన్నారు. ఆ సమయంలో విశాఖపట్నం నక్సల్స్ ప్రభావిత ప్రాంతంగా ఉండేదన్నారు. నక్సల్స్ ప్రాబల్య ప్రాంతాల్లో గంజాయి సాగు అనేది విచ్చలవిడిగా జరిగేదన్నారు. గంజాయి, అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపామని కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఆ రోజున్న పరిస్థితుల్లో పోలీసులు గంజాయి సాగు ప్రాంతాల్లో ప్రవేశించి గంజాయి తోటలను ధ్వంసం చేసే పరిస్థితి ఉండేది కాదని, అందువల్ల గంజాయి రవాణా మార్గాలను టార్గెట్ చేశామన్నారు. అక్కడ పని చేసిన రెండు సంవత్సరాల పాటు లక్ష కిలోల వరకు గంజాయిని జప్తు చేశామన్నారు. కాకినాడ పోర్టులో డీజిల్ దొంగతనాలు, అసాంఘిక కార్యక్రమాలు జరిగేవని అక్కడ పని చేసే కాలంలో వాటన్నింటినీ అరికట్టామన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంటు లేకపోయినా కూడా తమ పర్యవేక్షణలో ఉన్న ప్రదేశాలలో అసాంఘిక కార్యక్రమాలను పూర్తిగా నిర్మూలించామన్నారు. పోలీస్ శాఖపై నిందలు వేస్తే సహించేది లేదని, అలాంటి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని డీఐజీ స్పష్టం చేశారు.

ఆగస్టు 13న తాత్కాలిక కార్యవర్గం ఏర్పాటు

నంద్యాల కల్చరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): వడియరాజుల సత్రం నిర్వహణలో వచ్చిన అభిప్రాయ భేదాల దృష్ట్యా తాత్కాలిక కార్యనిర్వహక వర్గాన్ని ఆగస్టు 13వ తేదీన ఏర్పాటు చేయనున్నట్లు శ్రీశైలం దేవస్థానం ఈవో శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశము నిర్వహించేందుకు దేవస్థాన ఉపకార్య నిర్వహణాధికారి రమణమ్మ, అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఇంజనీరు బాలమురళీకృష్ణ, పర్యవేక్షకులు శివప్రసాద్, మల్లికార్జునను సభ్యులుగా నియమించినట్లు పేర్కొన్నారు. ఆగస్టు 13వ తేదీ ఉదయం 11గంటలకు శ్రీశైల క్షేత్రంలో వడియరాజుల సత్రం తాత్కాలిక కార్యవర్గాన్ని ఏర్పాటు చేస్తామని ఆయన వివరించారు.

బస్సు, బైకు ఢీ


బస్సు నుంచి దిగుతున్న ప్రయాణికులు

బండిఆత్మకూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): నంద్యాల, ఆత్మకూరు ప్రధాన రహదారిలోని ఏ కోడూరు దర్గా సమీపంలో మలుపు వద్ద ప్రమాదం జరిగింది. శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలో ఆత్మకూరు వైపు నుంచి వస్తున్న బైక్, నంద్యాల నుంచి నారాయణపురం వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎదురెదురుగా ఢీకొన్నాయి. బస్సు డ్రైవర్ చాకచక్యంగా బస్సును రోడ్డు సైడ్‌కు మళ్లించటంతో ద్విచక్ర వాహనదారుడికి స్వల్పగాయాలు కాగా, బస్సులో ఉన్న కొందరు ప్రయాణికులకు గాయాలయ్యాయి. బస్సు కాస్త ముందుకెళ్లి గుంతలోకి దిగి ఉంటే ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండేదని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేశారు. బండిఆత్మకూరు పోలీసులు చేరుకుని బస్సును పక్కకు తీసి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలి

- ఐఏఎల్ డిమాండ్



బార్ అసోసియేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

కర్నూలు లీగల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్(ఐఏఎల్) శుక్రవారం డిమాండ్ చేసింది. ఐఏఎల్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కర్నూలు బార్ అసోసియేషన్ ఎదుట న్యాయవాదులు నిరసన చేపట్టారు. ఐఏఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.రంగనాథ్ మాట్లాడుతూ న్యాయవాదుల సంక్షేమ నిధిని రూ.10 లక్షలకు పెంచాలని, న్యాయవాదుల రక్షణ బిల్లును వెంటనే ఆమోదించి న్యాయవాదులకు హెల్త్ కార్డులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు పాలూరి రవి గువేరా, జిల్లా ప్రధాన కార్యదర్శి రవికాంత్ ప్రసాద్, కోశాధికారి దస్తగిరి, సీనియర్ న్యాయవాదులు చంద్రుడు, మాసిపోగు సుబ్బయ్య, కె.ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

మంత్రాలయం, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని వగరూరు గ్రామానికి చెందిన కురువ పద్మావతి(36)అనే మహిళ చెరువులోకి దూకి ఆత్మహత్య చేసుకుంది. మంత్రాలయం ఎస్ఐ శివాంజల్ తెలిపిన వివరాలివీ.. పద్మావతి ఈనెల 23న ఇంటినుంచి వెళ్లిపోయింది. కనిపించకపోవడంతో బంధువులు గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. శుక్రవారం వగరూరు చెరువులో పద్మావతి మృతదేహం లభ్యమైంది. పద్మావతికి 15ఏళ్ల క్రితం పెద్దకడబూరు మండలం కమ్మలదిన్నె గ్రామానికి చెందిన కురువ నాగేంద్రతో వివాహమైంది. వీరికి సంతానం లేరు. ఆమె భర్త నాగేంద్ర 12 ఏళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. ఒంటరిగా ఉన్న పద్మావతి తన పుట్టినిలైన వగరూరులో ఉంటోంది. 7నెలల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ మనస్తాపానికి గురైంది. దీంతో ఆమె ఆత్మహత్య చేసుకుంది. శుక్రవారం చెరువులో పద్మావతి మృతి తేలియాతుండడం చూసిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మహిళ మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ఆదోని, జూలై 25(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతి చెందినట్లు త్రీటౌన్ ఎస్ఐ రామస్వామి తెలిపారు. వివరాలు.. పట్టణంలోని కేవీఆర్ కాలనీకి చెందిన వెంకటేశులు, శాంతమ్మ దంపతుల కుమారుడు వన్నయ్య(32). బేల్దారి పనిచేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉంటున్నాడు. శుక్రవారం ఎమ్మిగనూరు బైపాస్ సమీపంలో నూతన గృహ నిర్మాణంలో భాగంగా లిఫ్ట్ ద్వారా ఇటుకలను పంపుతున్నాడు. ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురయ్యాడు. గుర్తించిన తోటి కార్మికులు హుటాహుటిన ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స అందించిన వైద్యులు మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య సంధ్య ఉంది. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య


పత్తికొండ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ పట్టణంలోని 16వ వార్డులో నివసిస్తున్న గోకారమ్మ చిన్నకుమారుడు ఇమాంవలి (23) అనే యువకుడు శుక్రవారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ప్రేమ వ్యవహారమే ఆత్మహత్యకు కారణమని తెలిసింది. ఆత్మహత్యపై తమకు సమాచారం అందలేదని విచారిస్తామని సీఐ జయన్న తెలిపారు.

పాలకొలనులో మిస్సైల్ ప్రయోగం

రక్షణ రంగంలో మరో ముందడుగు

- యూఎల్‌పీజీ-వీ3 పరీక్షలు విజయవంతం
- దేశీయంగా సరికొత్త టెక్నాలజీతో సత్తా

ఓర్వకల్లు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): భారత రక్షణ రంగంలో మరో అడుగు ముందుకు పడింది. కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం పాలకొలను గ్రామ సమీపాన గల డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్(డీఆర్‌డీవో) ద్వారా శుక్రవారం ప్రతిష్ఠాత్మకంగా చేసిన క్షిపణి ప్రయోగం విజయవంతమైంది. మన దేశంలోనే తయారైన ఓ మిస్సైల్‌ను యూఏవీ లంచ్‌డ్ ప్రెసిషన్ గైడెడ్ మిస్సైల్ (యూఎల్‌పీజీ-వీ3)కి సంబంధించిన పరీక్షలను విజయవంతంగా నిర్వహించారు. కర్నూలు జిల్లాలో ఉన్న నేషనల్ ఓపెన్ ఏరియా రేంజ్ (ఎన్‌వోఏఆర్)లో డ్రోన్ నుంచి మిస్సైల్‌ను ఏ సమస్య లేకుండా డీఆర్‌డీవో విజయవంతంగా ప్రయోగించిందని రక్షణ శాఖ తెలిపింది. గతంలోనూ డైరెక్టెడ్ ఎనర్జీ వెపన్స్ సిస్టమ్‌ను పరీక్షించేందుకు ఇక్కడే ప్రయోగాలు చేశారు.



పాలకొలను లోని నేషనల్ ఓపెన్ ఏరియా రేంజ్ (ఎన్‌వోఏఆర్)


నూతనంగా డ్రోన్ ద్వారా ప్రయోగించిన క్షిపణి

రక్షణ రంగంలో మైలురాయి


- రాజ్‌నాథ్‌సింగ్, భారత రక్షణ శాఖ మంత్రి



డీఆర్‌డీవో ద్వారా చేసిన డ్రోన్ నుంచి క్షిపణి ప్రయోగం విజయవంతం రక్షణ రంగంలో మరో మైలురాయి అని భారత రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఆయన ఢిల్లీ నుంచి సోషల్ మీడియా ద్వారా తెలిపారు. మోడ్రన్ మిస్సైల్ వ్యవస్థను రూపొందించడంలో విజయవంతంగా పరీక్షించినందుకు డీఆర్‌డీవో, ఆ సంస్థ భాగస్వాములైన డిఫెన్స్ క్యాపిటల్ ప్రొక్యూర్‌మెంట్ పార్టనర్స్ (డీసీపీపీలు), మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్(ఎంఎస్ఎంఈలు), స్టార్టప్‌లకు ఆయన అభినందనలు తెలిపారు. దేశీయంగా సరికొత్త టెక్నాలజీతో ఆత్మనిర్భర్ భారత్ ద్వారా సత్తా చాటడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ విజయం దేశంలో అత్యాధునిక రక్షణ ఆవిష్కరణలలో స్వదేశీ టెక్నాలజీ పెరుగుతుందని స్పష్టం చేశారు.

ఆంధ్రప్రదేశ్‌కు గర్వంగా ఉంది

- సీఎం చంద్రబాబునాయుడు



కర్నూలు జిల్లాలోని డీఆర్‌డీవో ద్వారా డ్రోన్ నుంచి మిస్సైల్‌ను విజయవంతంగా ప్రయోగించడంపై సీఎం చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తంచేశారు. భారతదేశ రక్షణ పర్యావరణ వ్యవస్థ వృద్ధికి దోహదపడటం ఆంధ్రప్రదేశ్‌కు గర్వంగా ఉందని కొనియాడారు. క్షిపణి పరీక్ష విజయవంతం చేసిన శాస్త్రవేత్తలు, ఆవిష్కర్తలకు అభినందనలు తెలిపారు. దేశ రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేయడంలో ఇది ముఖ్యమైన ముందడుగు అని చంద్రబాబు అభివర్ణించారు. యూఎల్‌పీజీ-వీ3 విజయం ఆత్మనిర్భర్ భారత్ నిజమైన స్ఫూర్తిని ప్రతిబింబిస్తోందని అన్నారు.

ఏపీకి మరో ఘనత: ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి



ఓర్వకల్లు మండలంలోని డీఆర్‌డీవో నిర్వహించిన క్షిపణి ప్రయోగం విజయవంతం కావడంపై ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రయోగం రాష్ట్రానికి మరో ఘనత సాధించి పెట్టిందన్నారు. గతంలోనూ దేశీయంగా అభివృద్ధి చేసిన తేలికైన క్షిపణితో రెండున్నర కిలోమీటర్ల దూరంలోని యుద్ధ ట్యాంకును ధ్వంసం చేసే ప్రయోగాన్ని డీఆర్‌డీవో విజయవంతంగా పూర్తిచేసిందన్నారు. డీఆర్‌డీఓతో పాటు, అనుబంధ రక్షణ సంస్థల శాస్త్రవేత్తలకు ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు.

పాలకొలనుకు జాతీయ స్థాయిలో గుర్తింపు



పాలకొలను సమీపంలో ఏర్పాటు చేసిన డీఆర్‌డీవో సంస్థ ద్వారా గ్రామానికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. డీఆర్‌డీవో ద్వారా నిర్వహించిన క్షిపణుల ప్రయోగాలన్నీ విజయవంతం కావడం హర్షించదగ్గ విషయం. సంస్థ ఏర్పాటుకు సాగు భూములిచ్చిన గ్రామ రైతులందరికీ కృతజ్ఞతలు.

- చదువుల సుజాతమ్మ, సర్పంచ్, పాలకొలను


హంద్రీనీవానీటికి జలహారతి ఇస్తున్న మంత్రి, ఎమ్మెల్యేలు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

సీమను సస్యశ్యామలం చేస్తాం

- కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్
- 68 చెరువులకు నీటివిడుదల
- కృష్ణమ్మకు జలహారతి ఇచ్చిన మంత్రి, ఎమ్మెల్యేలు కోట్ల, కేఈ

పత్తికొండ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రాయలసీమలోని అన్ని ప్రాంతాలకు కృష్ణాజలాలను తరలించి సస్యశ్యామలం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ వెల్లడించారు. ఈ మేరకు కృష్ణగిరి మండలంలోని ఆలంకొండ వద్ద పంప్‌హౌస్ నుంచి హంద్రీనీవా ద్వారా 68 చెరువులకు నీటిని మంత్రితో పాటు డోన్, పత్తికొండ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, కేఈ శ్యాంబాబులు విడుదల చేశారు. తొలిరోజు 80 క్యూసెక్కుల నీటిని అధికారులు చెరువులకు మళ్లించారు. ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ రాయలసీమను సస్యశ్యామల ప్రాంతంగా చేసేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సంకల్పించారన్నారు. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. పత్తికొండ, డోన్, ఆలూరు నియోజకవర్గాల్లోని చెరువులకు కృష్ణా జలాలతో నింపడం సాధారణ విషయం కాదన్నారు. మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి ముందుచూపుతో చేసిన ఆలోచన ఇప్పుడు కరువు పల్లెలకు వరమైందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వరయాదవ్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ లక్ష్మీకాంతరెడ్డి, పత్తికొండ మార్కెట్‌యార్డ్ చైర్మన్ ఆలంకొండ నబి, నాయకులు ఎల్వీ ప్రసాద్, మర్రి శ్రీరాములు, దామోదర్‌నాయుడు, గురుస్వామి, మహమ్మద్ రఫి తదితరులు ఉన్నారు.

చేయాల్సింది ఎంతో ఉంది : కేఈ శ్యాంబాబు, ఎమ్మెల్యే

68 చెరువులకు నీటిని నింపడంతో అనుకున్న పని పూర్తి కాలేదు. ఆ చెరువుల నుంచి పిల్ల కాలువల ద్వారా పొలాలకు సాగునీరు చేరాలి. కుంటలకు నీటిని నింపుకోవాలి. భవిష్యత్‌లో నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకూ సాగునీరు అందించే రోజు రావాలి. మా నాన్న కేఈ కృష్ణమూర్తి నాడు ప్రారంభించిన ఈయజ్ఞం నేను ఎమ్మెల్యేగా ఉన్నరోజున పూర్తికావడం ఆనందంగా ఉంది.

అంతా మంచే జరుగుతుంది
- కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి, ఎమ్మెల్యే

మాది ప్రజల కోసం పనిచేసే మంచి చేసే ప్రభుత్వం. ఈ ప్రభుత్వంలో అంతామంచే జరుగుతుంది. డోన్ నియోజకవర్గంలో అన్ని చెరువులను నింపుతాం. డోన్‌ను అన్నివిధాల అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నాం. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వాన్ని నిధులు మంజూరు చేయాలని కోరాం. నిధులు మంజూరైన వెంటనే పనులు త్వరితగతిన చేపడుతాం.

ఇరువర్గాలపై కేసు నమోదు

సి.బెళగల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని మారందొడ్డి గ్రామంలో గురువారం ఘర్షణపడ్డ ఇరువర్గాలపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ ఆచారి తెలిపారు. మారందొడ్డి గ్రామంలో రుక్మాంగద ఇంటిపై రాళ్లతో దాడిపాల్పడిన వెంకటేశ్వర్లు, మోహన్‌నాయుడు పైతో పాటు రుక్మాంగద వర్గీయులపై కేసు నమోదు చేశామన్నారు.

బ్యాంకు ఖాతాల్లో నగదు మాయం



ఆస్పరిలో నగదు మాయమవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధితులు

ఆస్పరి, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఆస్పరి ఎస్‌బీఐ బ్యాంకులో క్రెడిట్ కార్డులున్న ఖాతాలో నగదు మాయమవుతున్నట్లు శుక్రవారం బాధితులు గోపాల్‌రెడ్డి, పురుషోత్తం, బసవరాజు, ఈరన్న, సురేంద్ర వాపోయారు. ఒక్కో ఖాతా నుంచి వేలాది రూపాయలు మాయమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్‌శాఖలో లైన్‌మెన్‌గా పని చేస్తున్న గోపాల్‌రెడ్డి ఖాతా నుంచి రూ.43 వేలు, చిరుమాన్‌దొడ్డి గ్రామానికి చెందిన రైతు బసవరాజు ఖాతాలో రూ.26 వేలు, ఆస్పరి గ్రామానికి చెందిన పురుషోత్తం ఖాతాలో రూ.12 వేలు నగదు మాయమైనట్లు తెలిపారు. మండలంలో సుమారు క్రెడిట్ కార్డులున్న 100 ఖాతాల నుంచి నగదు మాయమైనట్లు బాధితులు లబోదిబోమంటున్నారు. ఈ విషయాన్ని తాము బ్యాంకు మేనేజర్ దృష్టికి తీసుకెళ్లినా పొంతనలేని సమాధానం చెబుతున్నాడన్నారు. మీరు బయట చూసుకోవాలి గానీ బ్యాంకుకు సంబంధం లేదని చెబుతున్నాడని బాధితులు వాపోయారు.

ప్రమాదంలో వ్యక్తి మృతి


రాజు (ఫైల్)

దేవనకొండ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిని తప్పించబోయి బైక్ అదుపుతప్పడంతో జరిగిన ప్రమదంలో దేవనకొండకు చెందిన వడ్ల రాజు (42) మృతి చెందాడు. పని నిమిత్తం దేవనకొండ నుండి టర్నింగ్ (క్రాస్‌రోడ్డు)కు బైక్‌పై వెళ్తుండగా ఈద్గా వద్ద బైక్‌కు వ్యక్తి అడ్డు రాగా, తప్పించబోయి ప్రమాదం చోటుచేసుకొంది. ప్రమాదంలో రాజు తలకు తీవ్ర గాయం కావడంతో స్థానిక వైద్యశాలకు కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం అంబులెన్స్‌లో పత్తికొండకు తరలించగా, మార్గమధ్యంలో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య రాణి, ఇద్దరు కుమారులు, కుతూరు ఉన్నారు.

లక్ష్యం మేరకు చేపల పెంపు

- సుంకేసులలో రూ.1.30 కోట్లు చేపగుడ్లు
- మత్స్యశాఖ డీడీ దామోదర్‌రావు



కర్నూలు అగ్రికల్చర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలోని చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాల్లో లక్ష్యం మేరకు చేప పిల్లలను పెంచేందుకు చర్యలు చేపట్టామని జిల్లా మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ దామోదర్ తెలిపారు. శుక్రవారం నగరంలోని మత్స్యశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు చేప పిల్లల కేంద్రాల్లో అవసరమైన చర్యల చేపట్టామన్నారు. కర్నూలు జిల్లాలోని 3 చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాలైన కర్నూలు, సుంకేసుల, గాజులదిన్నె కేంద్రాల్లో 70 లక్షల చేప పిల్లలు, అదే విధంగా నంద్యాల జిల్లాలోని ఒకే ఒక సీడ్ ఫారంలో 25 లక్షల చేపల పిల్లలు మొత్తం 95 లక్షల చేప పిల్లల ఉత్పత్తిని చేపట్టాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామన్నారు. ఆ దిశగా కర్నూలు జిల్లాలోని మూడు ఫారాల్లో మరమ్మతుల పనులు పూర్తి చేయడం జరిగిందని కర్నూలు ఫిష్ ఫీడ్ పెంపకం కేంద్రానికి కేసీ కాలువ నీటిని తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం ఆ నీరు కొంచెం విడుదలైన తర్వాత సిమెంట్ తొట్లలో నింపడం జరుగుతుందని మురుగునీరు ఆ తొట్లలో చేరికతో చేపపిల్లలు చనిపోయే అవకాశం ఉందన్నారు. అదే విధంగా మూడు రోజుల గుడ్డు పిల్లలను ఏలూరు జిల్లా బాదంపూడి నుంచి కానీ, నిడ్‌పెన్నార్ డ్యాంతో పాటు అనంతపురం సీడ్ ఫారాల నుంచి తీసుకురావాల్సి ఉందని డిప్యూటీ డైరెక్టర్ దామోదర్ రావు తెలిపారు. అక్కడ చేప విత్తనం అందుబాటులో ఉన్నప్పుడు తీసుకుని వచ్చి జిల్లాలోని గాజులదిన్నెతో పాటు కర్నూలు నగరంలోని చేప పిల్లల కేంద్రాల్లో నిల్వ చేయడానికి అవసరమైన చర్యలు చేపట్టామని స్పష్టం చేశారు. ఇప్పటికే సుంకేసుల ఫారంలో 1.30 కోట్ల చేప గుడ్డు పిల్లలను నిల్వ చేయడం జరిగిందన్నారు.

అధికారులపై కేంద్ర బృందం ఆగ్రహం



రికార్డులను పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

జూపాడుబంగ్లా, జూలై 25(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ, జాతీయ ఉపాధి హామీ పథకం రికార్డుల నిర్వాహణ సరిగా లేదని జాతీయ ఉపాధిహామీ కేంద్ర బృందం సభ్యులు అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జూపాడుబంగ్లాలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం కేంద్ర బృందం సభ్యులు గ్రామసభ సర్పంచ్ బాలయ్య అధ్యక్షతన నిర్వహించారు. గ్రామపంచాయతీలో ఎన్ఆర్ఈజీఎస్, ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై నిర్వహించాల్సిన గ్రామసభలు, తీర్మానాలు లేకపోవడంతో అధికారుల నిర్లక్ష్య వైఖరి అర్థమవుతోందని కేంద్ర బృందం లీడర్ సంతోష్‌కుమార్, సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 2023-24 ఏడాదికి సంబంధించిన ఆర్థిక సంఘం నిధులు ఖర్చు, వివరాలు, తీర్మా నాలు, వార్డు సభ్యుల హాజరు, గ్రామసభల నిర్వహణకు సంబంధించిన రికా ర్డులు లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. ఇకపై రికార్డుల నిర్వాహణ సక్రమంగా నిర్వహించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గోపీకృష్ణ, ఏపీడీ అన్వారాబేగం, ఏఈలు బషీర్, నాగేంద్ర, ఏపీవోలు గౌరిబాయి, రేష్మా తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి



మాట్లాడుతున్న యేసురత్నం

నందికొట్కూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో ప్రభుత్వ రంగ సంస్థలు కేంద్ర ప్రభుత్వ పథకాల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు యేసురత్నం, నందికొట్కూరు కార్యదర్శి గోపాలకృష్ణ డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయం వద్ద శుక్రవారం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 3.5 లక్షల మంది ప్రభుత్వ సంస్థలు, ధార్మిక సంస్థలు వివిధ శాఖల్లో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్నారన్నారు. ప్రభుత్వాలు వారి సంక్షేమం గురించి ఆలోచించి మినిమం టైం స్కేల్ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత



ఆర్థిక సాయం అందజేస్తున్న మిత్రులు

వెలుగోడు, జూలై 25(ఆంధ్రజ్యోతి): వెలుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997-98లో పదో తరగతి చదివిన విద్యార్థుల్లో శ్రీనివాసులు అనే వ్యక్తి ఇటీవల మృతిచెందాడు. స్నేహితులంతా కలిసి రూ.50,500 స్నేహితుడి భార్య అపర్ణకు శుక్రవారం అందజేశారు. ఆ నిధులను చిన్నారుల చదువులకు వినియోగించుకోవాలని, తాము అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఖాదర్‌వలి, శేషు, రాజశేఖర్, గోవర్ధన్, జావీద్, రవూఫ్ తదితరులు ఉన్నారు.

హామీలు నేరవేర్చాలి: శిల్పా



రేగడగూడూరులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా

వెలుగోడు, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని రేగడగూడూరు గ్రామంలోని వడ్డేపేటలో శుక్రవారం వైసీపీ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఏడాది పాలన పూర్తయిన హామీలు నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు శిల్పా భువనేశ్వరరెడ్డి, అంబాల ప్రభాకరరెడ్డి, తిరుపెంరెడ్డి, రామిరెడ్డి, నసురుల్లాఖాన్, ఎంపీపీరమేశ్ పాల్గొన్నారు.

క్లోరినేషన్‌పై దృష్టి సారించాలి

పాములపాడు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాలలోని తాగునీటి ఓవర్‌హెడ్ ట్యాంకుల క్లోరినేషన్‌పై దృష్టి సారించాలని ఎంపీడీవో చంద్రశేఖర్ సూచించారు. పాములపాడు ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో తాగునీటి నాణ్యత, సంరక్షణ, పారిశుధ్యం, తీసుకోవాల్సిన చర్యలు, తదితర అంశాలపై చర్చించారు.

మార్కెట్ మురుగుమయం

● చిన్నపాటి వర్షానికే రోడ్లు అపరిశుభ్రం

● దుర్వాసన వెదజల్లుతుండడంతో ప్రజలు, వ్యాపారుల అవస్థలు

నంద్యాల రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణం గాంధీచౌక్ సమీపంలోని మార్కెట్‌లో చిన్నపాటి వర్షం కురిసినా రోడ్లన్నీ మురుగుమయమతున్నాయి. దీంతో దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమల బెడద అధికమై వ్యాపారులు, ప్రజలు రోగాల పాలవుతున్నారు. నిత్యం వేల మంది మార్కెట్‌కు వస్తుంటారు. ఈ మురుగును చూసి ప్రజలు ఎవరూ కూరగాయలు కొనుగోలు చేయడానికి రావడం లేదని మరుసటి రోజుకు కూరగాయలు దెబ్బతిని కిందపోయడంతో నష్టాలు వస్తున్నాయని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని వ్యాపారులు, ప్రజలు కోరుతున్నారు.



మార్కెట్‌లోని రోడ్డుపై మురుగు నిల్వ

సమస్య తీరడం లేదు



20 ఏళ్లుగా వ్యాపారం చేస్తున్నాను. అప్పటి నుంచి ఈ రోడ్డు పరిస్థితి ఇలానే ఉంది. మున్సిపల్ అధికారులు ప్రతిరోజు రూముకు రూ.150 చొప్పున జమ చేసుకుంటున్నారు. అయినా మార్కెట్లో సమస్యలు తీర్చడం లేదు. ఇలాగైతే మేం వ్యాపారం ఎలా చేసుకోవాలి. గత ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే రెండు సార్లు పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామన్నారు. తర్వాత పట్టించుకోలేదు. ప్రస్తుతమున్న ప్రజాప్రతినిధులైనా మా సమస్యను పరిష్కరించాలి.

- ఫయాజ్, వ్యాపారి

దుర్వాసన భరించలేకున్నాం



నేను కొన్నేళ్లుగా వ్యాపారం చేస్తున్నా. వర్షం పడిన ప్రతిసారి ఈ రోడ్డు మురుగుమయవుతుంది. దుర్వాసన భరించలేకపోతున్నాం. దోమలు అధికమై రోగాల బారిన పడుతున్నాం. మురుగు లేకుంటే ఉదయం 11 గంటలకంతా కూరగాయలు అన్ని అమ్ముకునేవాళ్లం. ఇప్పుడు సాయంత్రం 5 గంటలు అయినా సగం వ్యాపారం కూడా జరగలేదు నష్టాలు వస్తున్నాయి.

- మహబూబ్ జిలానీ, వ్యాపారి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



లింగాల గ్రామంలో కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య



సున్నిపెంటలో పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి

పాములపాడు, జూలై 25(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య చెప్పారు. మండలంలోని లింగాల గ్రామంలో శుక్రవారం టీడీపీ నాయకులు సర్పంచ్ మల్లీశ్వరరెడ్డి, స్వాములుతో కలిసి 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని నిర్వహించారు. పాములపాడులో ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన రూ. 4,00,347 చెక్కును బాధితురాలు లలితమ్మకు ఎంపీడీవో కార్యాలయంలో ఎమ్మెల్యే అందించారు. టీడీపీ మండల కన్వీనర్ రవీంద్రరెడ్డి, నాయకులు తిమ్మారెడ్డి, హరినాథరెడ్డి, జనార్దన్‌రెడ్డి, లింగస్వామి గోవిందు, కృష్ణ, నాగలక్ష్మిరెడ్డి, లింగస్వామి మధు పాల్గొన్నారు.

కొత్తపల్లి: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబు నెరవేరుస్తున్నారని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య తెలిపారు. శుక్రవారం ఎమ్మెల్యే మండలంలోని ఎం.లింగాపురంలో మండల కన్వీనర్ నారపురెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి లింగస్వామి గౌడు మండల, గ్రామ నాయకులతో కలిసి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు.

● ప్రైవేటు ఎరువుల దుకాణాల వారు యూరియాతో పాటు ఇతర కాంప్లెక్స్ ఎరువులకు కృత్రిమ కొరత సృష్టించి రైతులకు ఇబ్బందులు కలగజేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య హెచ్చరించారు. శుక్రవారం కొత్తపల్లి ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో ఈవోఆర్‌డీ సుబ్బారావు అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో ఉన్న ఆర్‌బీకే బోర్డులు ఇప్పటికీ దర్శనం ఇస్తున్నాయని, తొలగించి రైతు సేవా కేంద్రాలు (ఆర్ఎస్‌కే)గా మార్చాలని అధికారులను ఆదేశించారు. పజల నుంచి 43 దరఖాస్తులను ఎమ్మెల్యే స్వీకరించారు. జడ్పీటీసీ సోముల సుధాకర్‌రెడ్డి, తహసీల్దార్ ఉమారాణి, ఏవో అమీరున్నిసాబీ, వైద్యాధికారులు మహ్మద్ బేగ్, దీపా నాగవేణి, విజయేంద్ర, జుబేర్, ఎంఈవో-2 ఇనయతుల్లా, నాగంపల్లి సొసైటీ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, సర్పంచులు చంద్రశేఖర్ యాదవ్, శోభలత, డైరెక్టర్ రాధాకృష్ణారెడ్డి, మల్లారెడ్డి, జీఎండీ రఫీ, జహరుల్లా, పాల్గొన్నారు.

నంద్యాల ఎడ్యుకేషన్: సున్నిపెంట గ్రామాన్ని అభివృద్ధి చేసిన ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కుతుందని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే సున్నిపెంటలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. గ్రామంలోని అక్కమ్మ సెంటర్ సమీపంలో జల్‌జీవన్ మిషన్ పథకం కింద రూ.5.14 కోట్లతో పైప్‌లైన్ వేసేందుకు భూమిపూజ చేశారు. లింగాలగట్టు ప్రాంతంలోని వైజాక్ క్యాంప్, బోయ క్యాంప్‌లో పర్యటించారు. మండల ఇంచార్జి యుగంధర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి సురేష్, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

కామేశ్వరీదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు

● మహానంది ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి



అర్చకులతో మాట్లాడుతున్న ఈవో శ్రీనివాసరెడ్డి

మహానంది, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో శ్రావణ మాసం పురస్కరించుకొని కామేశ్వరీదేవి అమ్మవారికి శ్రావణ శుక్రవారాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. దేవస్థానం ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఆలయ అర్చకులతో ఈవో సమావేశం నిర్వహించారు. శ్రావణ శుక్రవారాల్లో అమ్మవారికి ప్రత్యేక సేవలు చెసే విధానంపై చర్చించారు. మెదటి శుక్రవారం గాజుల అలంకారం, రెండో శుక్రవారం పసుపు కొమ్ములతో, మూడో శుక్రవారం ఫలాలతో, నాలుగో శుక్రవారం పట్టుచీరలతో కామేశ్వరీదేవి అమ్మవారిని అలంకరించనున్నట్లు తెలిపారు. వచ్చే నెల 8న ఆలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ మధు పాల్గొన్నారు.

వైభవంగా పల్లకీ సేవ

మహానంది, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో శుక్రవారం రాత్రి పల్లకీ సేవను ఆలయ అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో అర్చకులు వేదమంత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల సమక్షంలో ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జి పర్యవేక్షకుడు పసుపుల సుబ్బారెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ధార్మిక కార్యక్రమాలు

కొత్తపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): నందికుంట నందీశ్వర ఆలయంలో ఈ నెల 22న ప్రారంభమైన ధార్మిక కార్యక్రమాలు శుక్రవారం ముగిశాయి. టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యనిర్వహకుడు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో గత నాలుగు రోజులుగా ధార్మిక సభ నిర్వహించారు. ముగింపు రోజున గోపూజ, కుంకుమార్చన, తదితర పూజల నంతరం వెంకటరెడ్డి ఆధ్యాత్మిక భావనలతో కలిగిన పలు అంశాలను భక్తులకు వివరించారు. అలాగే ఇస్కాన్ ధర్మప్రచారకులు కీర్తి రాజాదాస్, శ్రీమద్రామాయణం, మహాభారతం, భగవద్గీతపై ప్రవచనాలు చేశారు. అర్చకుడు లక్ష్మీనారాయణ ఆచార్యులు, సర్పంచ్ నిత్యలక్ష్మి, నాయకులు నారాయణరెడ్డి, మధుసూదన్ రెడ్డి, భజన బృందం సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ఆత్మకూరు రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): శక్తి యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని సీఐ రాము సూచించారు. పట్టణంలోని ఇస్లాంపేటలోని శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో అవగాహన కార్యకరమం నిర్వహించారు. ఈ సందర్భంగా శక్తి యాప్ ఆవశ్యకత గురించి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ తాజుద్దీన్, ఏఎస్ఐ రఘురామయ్య, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాజీ సీఎం అచ్యుతానందన్‌కు నివాళి



నివాళి అర్పిస్తున్న నాయకులు

ఆత్మకూరురూరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): కరివేన గ్రామంలో శుక్రవారం కేరళ మాజీ సీఎం అచ్యుతానందన్‌కు నివాళి అర్పించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నరసింహనాయక్ మాట్లాడుతూ ప్రజా ఉద్యమాల సారధి కేరళ మాజీ సీఎం అచ్యుతానందన్ అని కొనియాడారు. ఎనిమిది దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ జీవితంలో అచ్యుతానందన్ ఆదర్శ నాయకుడిగా నిలిచారన్నారు. మహిళలకు సమాన హక్కులు కావాలని పోరాడిన నాయకుల్లో అగ్రగణ్యులని కొనియాడారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు వరప్రసాద్ యాదవ్ వేంకటేశ్వర్లు, నూర్ అహ్మద్, మౌళాలి, రాజు, తిరుపాలు, గణేష్ యాదవ్, నరసింహ, సుంకన్న తదితరులు ఉన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



కుందూలో నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

బండిఆత్మకూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరుకోవటంతో కుందూనదికి మరింత నీటిని ఎప్పుడైనా విడుదల చేయవచ్చని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ పద్మావతమ్మ సూచించారు. శుక్రవారం బండిఆత్మకూరు, కాకనూరు గ్రామాల వద్ద కుందూనదిపై ఉన్న వంతెనల వద్ద నీటి ప్రవాహ ఉధృతిని ఆమె పరిశీలించారు. వంతెనల వద్ద ఎలాంటి రక్షణ గోడలు లేవని, ప్రజలు అప్రమత్తంగా వెళ్లాలని సూచించారు. నదిలో దిగే ప్రయత్నం ఎవరూ చేయవద్దని, పశువుల కాపర్లు, చేపల వేటగాళ్లు నదిలో దిగవద్దని సూచించారు. నదీతీర గ్రామాల్లో దండోరాలు వేయించాలని వీఆర్వోలకు సూచించారు. అనంతరం కార్యాలయంలో డీలర్లతో తహసీల్దార్ మాట్లాడుతూ రేషన్ సరుకుల పంపిణీలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, డీలర్లు బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే డీలర్‌షిప్‌ను రద్దు చేస్తామని హెచ్చరించారు.

పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకారం



ఈర్నపాడులో ప్రమాణ స్వీకారం చేసిన పాలక మండలి సభ్యులు

బండిఆత్మకూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడు దేవాలయాల పాలకమండలి సభ్యల ప్రమాణ స్వీకారం దేవస్థాన అధికారులు నిర్వహించారు. శుక్రవారం మండలంలోని కడమలకాల్వ చెన్నకేశవస్వామి చైర్మన్‌గా అనకల మద్దిలేటి, ఈర్నపాడు ఈశ్వర, కోదండ రామ, చెన్నకేశవ ఆలయాల చైర్మన్‌గా చిన్నకాశన్న, శింగవరం వెంకటేశ్వర, ఆంజనేయ స్వామి ఆలయాల చైర్మన్‌గా శివసాయి సంజన్న నాయుడుతో పాటు ఆయా గ్రామాల్లో ఎనిమిది మంది చొప్పున సభ్యుల చేత ఆలయాల ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి, ఈవో ఆకృతి నాగప్రసాద్ ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమాల్లో సిబ్బంది నాగరాజు, టీడీపీ నాయకులు, పెద్దలు పాల్గొన్నారు.

పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు వెంకటేశ్వర్లు

జూపాడుబంగ్లా, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం పేదలకు పట్టణాల్లో రెండు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలాలు ఇస్తామన్న హామీ ఇచ్చిందని వెంటనే ఇవ్వాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా నాయకుడు వెంకటేశ్వర్లు డిమాండు చేశారు. జూపాడుబంగ్లాలో శుక్రవారం జిల్లా మహాసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటిన ఇంటిస్థలాలు, పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవడానికి కార్యాలయాల్లో ఆప్షన్ ఇవ్వలేదని అన్నారు. రైతులకు సుఖీభవ పథకాన్ని అమలు చేసి రైతులను ఆదుకోవా లని, జూపాడుబంగ్లాలోని 1, 2 ఎత్తిపోతల నుంచి మెట్ట ప్రాంతంలోని విస్తీర్ణం పెంచేలా సాగునీరు అందించాలని డిమాండు చేశారు. నాయకులు గాబ్రియల్, నరసింహులు, ఏసన్న తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు.

గోస్పాడు సహకార సొసైటీ అధ్యక్షుడిగా వీరేంద్ర సింహారెడ్డి బాధ్యతలు



బాధ్యతలు స్వీకరిస్తున్న వీరేంద్ర సింహారెడ్డి

గోస్పాడు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): గోస్పాడు సహకార సొసైటీ అధ్యక్షుడిగా ఎం.వీరేంద్ర సింహారెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తనపై నమ్మకంతో ఇచ్చిన పదవికి న్యాయం చేస్తానని అన్నారు. అలాగే డైరెక్టర్లుగా పండ్లాపురం పెద్ద హుసేన్‌సాహెబ్, రామేశ్వరరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు ఎన్ఎండీ ఫయాజ్, కేడీసీసీ బ్యాంక్ జనరల్ మేనేజర్ శివలీల, డిప్యూటీ మేనేజర్ నాగిరెడ్డి, శిరివెళ్ల బ్రాంచ్ మేనేజర్ రేణుక, సూపర్‌వైజర్ సుబ్బరాయుడు, మండల అగ్రికల్చర్ ఆఫీసర్ స్వప్నిక, గోస్పాడు సీఈవో అక్తర్‌హుసేన్, టీడీపీ నాయకులు జిన్నా శ్రీనివాసరెడ్డి, భూమా హుసేని, బాలన్న తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

మహానంది, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మహానంది మండలం ఎం.తిమ్మాపురంలో ఐటీఎం యూనివర్సిటీ, గాల్వేర్, మధ్యప్రదేశ్‌కు చెందిన విద్యార్థులు పంటల సాగుపై సోషల్ మ్యాప్ ద్వారా అవగాహన కల్పించారు. శుక్రవారం గ్రామ ప్రధాన కూడలిలో రైతులకు విద్యార్థులు వ్యవసాయం సాగుపై పరిశోధనలో భాగంగా అవగాహన కల్పించారు. ముఖ్యంగా పసుపు, అరటి పంటలపై పరిశోధనలు చేసి రైతులకు తమ శిక్షణలో అవగాహన కల్పించారు. అలాగే రైతులకు సరికొత్త పంటల సాగు, దిగుబడి అంశాలతో పాటు ఆర్థికంగా ఏవిధంగా చెందాలనే అంశంపై క్లుప్తంగా వివరించారు

ఉపాధ్యాయులకు సన్మానం

నంద్యాల రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): నంద్యాల మండలం రాయమాల్పురం గ్రామంలోని మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో పనిచేసి పదోన్నతిపై నల్లకాల్వకు వెళ్లిన రమణయాదవ్, బదిలీపై తిమ్మాపురం వెళ్లిన మాధవిని ఎస్‌జీటీని పాఠశాల హెచ్ఎం లక్ష్మణ్ నాయక్ అధ్యక్షతన శుక్రవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి ప్రభాకర్, పాఠశాల ఎక్స్ అఫీషియల్ సభ్యులు శ్రీను, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ శేషు, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బాధ్యతగా పని చేయాలి: డీఎంహెచ్‌వో



కొత్తపల్లి పీహెచ్‌సీలో రికార్డును పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

కొత్తపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): వైద్య సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ సూచించారు. కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు శివపురం గూడెంలో నిర్వహిస్తున్న 104 సంచార వైద్యశాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫ్రైడే - డ్రైడే కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా కొత్తపల్లి పీహెచ్‌సీలో రికార్డులతో పాటు రోజువారి ఓపీని పరిశీలించారు. జూలై నెలలో వైద్యశాలలో ఎంత మంది గర్భిణులకు ప్రసవాలు చేశారని వైద్యాధికారులు దీపానాగవేణి, మహ్మద్ బేగ్‌ను అడిగి తెలుసుకున్నారు. శివపురం గూడెంలో గర్భిణులు, బాలింతలతో మాట్లాడి ప్రభుత్వం అందించే పోషక ఆహారాలు అందుతున్నాయా? లేదా? అని ఆరా తీశారు. ఎర్రమఠం, కొత్తపల్లి, గోకవరం పీహెచ్‌సీలలో జూలై నెలలో ఒక ప్రసవం కూడా చేయకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కచ్చితంగా మెనూలో కనీసం మూడు పీహెచ్‌సీలలో పది మందికైనా ప్రసవాలు చేయాలని ఆదేశించారు. సిబ్బంది డిప్యూటేషన్లను రద్దు చేసి రెండు రోజుల్లో ఎర్రమఠం పీహెచ్‌సీకి పంపిస్తామని ఆయన తెలిపారు. వైద్యాధికారులు విజయేంద్ర, జుబేదా, మహమద్ బేగ్, దీపా నాగవేణి, జుబేర్ ఉన్నారు.

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణంలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను శుక్రవారం నంద్యాల డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను, ఓపీ విభాగాన్ని పరిశీలించి సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. హెల్త్ సెంటర్ వైద్యురాలు డాక్టర్ సాజిదా ఫిర్దోస్‌తో పాటు కొంత మంది సిబ్బంది సెలవులో ఉన్నట్లు గుర్తించి ఆయనే స్వయంగా రిజిస్టర్‌లో సెలవులను నమోదు చేశారు. వైద్య సేవల గురించి అక్కడి ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును విరమించుకోవాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు రణధీర్

ఆత్మకూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): ప్రజల సొమ్ము కార్పొరేట్ వ్యక్తులకు దోచిపెట్టేందుకే స్మార్ట్ మీటర్లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని, వీటిని విరమించుకోవాలని సీపీఎం నాయకుడు రణధీర్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల ముందు తాము అధికారంలోకి వస్తే కరెంట్ చార్జీలను పెంచబోమని చెప్పి అధికారంలోకి వచ్చిన సంవత్సరంలోనే ప్రజలపై రూ.20వేల కోట్ల భారం వేశారని అన్నారు. వైసీపీ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాన్ని ప్రస్తుత ప్రభుత్వం కొనసాగించడం సరికాదన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలతో పాటు స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. నాయకులు రామ్‌నాయక్, మంజుల, వీరన్న, నాగేశ్వరరావు, సద్దాంహుసేన్, జబివుల్లా తదితరులు ఉన్నారు.

నాబార్డు సేవలు అభినందనీయం: ఎమ్మెల్యే


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి

ప్యాపిలి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): నాబార్డు సేవలు అభినందనీయమని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కలచట్ల గ్రామంలో నాబార్డు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శుద్ధజల ప్లాంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ అభివృద్ధికి సహకారం అందించాలని నాబార్డ్ అధికారులను కోరారు. అంతకు ముందుగా ప్యాపిలిలో డీసీఎంఎస్ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ ఛైర్మన్ వై నాగేశ్వరరావుయాదవ్, నాబార్డ్ ఏజీఎం కార్తీక్, సర్పంచు రమాదేవి, దామోదర్‌రెడ్డి, లక్ష్మీనారాయణయాదవ్, టి శ్రీనివాసులు, సుబ్రమణ్యం, రాకేష్, ప్రసాద్, రమేష్‌రెడ్డి, రవి, రాజా తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలతోనే సంతృప్తి : బీసీ


వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి

అవుకు, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : సేవా కార్యక్రమాలతోనే సంతృప్తి కలుగుతుందని బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని జామియా మసీదులో తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను మత పెద్దలతో కలిసి ఆయన ప్రారంభించారు. ముస్లింలు బీసీ రాజారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ముస్లింలు మహమ్మద్‌షఫీ, మౌజాన్ ఇస్మాయిల్, మౌలాలి, అబీసాబ్, షరీఫ్, షేక్షావలి, మహబూబ్‌బాషా, ఉశేన్‌బాషా, జిలానిబాషా, ఆఫీద్, ఇలియాస్, చాంద్‌బాషా, ఇస్మాయిల్, అమీర్, టీడీపీ నాయకులు దంతెల రమణ, తిక్కన్న, అరుణ్ కుమార్ నాయక్, వెంకటరాముడునాయక్ పాల్గొన్నారు.

యూరియా కోసం బారులు

రుద్రవరం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రుద్రవరంలో యూరియా కోసం రైతులు బారులు తీరారు. శుక్రవారం రుద్రవరం సచివాలయానికి రుద్రవరం, కొండమాయపల్లె రైతులు యూరియా కోసం భారీగా తరలివచ్చారు. యూరియా కొరత రైతులను వెంటాడుతుంది. ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని యూరి యాను రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

కూరగాయాల మార్కెట్ శుభ్రతకు చర్యలు

కొలిమిగుండ్ల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ అధికారులు, గ్రామ సర్పంచ్ చొరవతో కూరగాయాల మార్కెట్‌కు కొత్త కళ సంతరించుకుంది. కొలిమిగుండ్లలోని కూరగాయాల మార్కెట్ ఆవరణం కొంత కాలంగా పిచ్చి మొక్కలు, చెత్తతో నిండి దిబ్బగా మారింది. దీంతో ఎంపీడీవో, పంచాయతీ అధికారుల ఆదేశాల మేరకు గ్రామ సర్పంచ్ జినుగు శివరాముడు శుభ్ర పరిచేందుకు చర్యలు తీసుకున్నారు. ఎక్స్‌కవేటర్ సహాయంతో ప్రాంగణంలోని పిచ్చి మొక్కలు, చెత్త, బండరాళ్లను తొలగించి శుభ్రపరిచారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

కొలిమిగుండ్ల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దవెంతుర్ల గ్రామంలో దళితుల ఇళ్లు పడగొట్టిన కర్నాటి పుల్లారెడ్డి అనే వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు సీఐ రమేష్‌బాబు శుక్రవారం వెల్లడించారు. కడప జిల్లా మైలవరం మండలం, ధన్నావాడ గ్రామానికి చెందిన కర్నాటి పుల్లారెడ్డి పెద్దవెంతుర్ల గ్రామంలో తన పొలం పక్కనున్న 10మంది దళితుల ఇళ్లను కూ లగొట్టినట్లు తెలిపారు. ప్రశ్నించిన బాధిత దళితులపై కులం పేరు తో దూషించారని, బాధితుల ఫిర్యాదుమేరకు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మాధవ్ పర్యటనను విజయవంతం చేయాలి

డోన్ టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పర్యటనను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సంధు వెంకటరమణ కోరారు. శుక్రవారం బీజేపీ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నంద్యాల జిల్లా కేంద్రంలో బీజేపీ కార్యాలయం నుంచి ర్యాలీ ప్రారంభం అవుతుందన్నారు. నియోజకవర్గంలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని తెలిపారు. సమావేశంలో నాయకులు ఉన్నారు.

'న్యాయవాదులకు రక్షణ చట్టం అమలు చేయాలి'

డోన్ టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదులకు రక్షణ చట్టం అమలు చేయాలని భారత న్యాయవాదుల సంఘం ఐఏఎల్ రాష్ట్ర కార్యదర్శి రాగుల రాముడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివరామకృష్ణ, డోన్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు శీలం భాస్కర్ నాయుడు కోరారు. శుక్రవారం పట్టణంలోని డోన్ కోర్టు గేటు వద్ద భారత న్యాయవాదుల సంఘం పిలుపు మేరకు ధర్నా చేశారు. న్యాయవాదులు టీఈ వేణుగో పాల్ గౌడు, రంగారెడ్డి, శ్రీనివాసులు శెట్టి, శ్రీరాములు, బొంకూరి రవి కుమార్, గార్లపాటి మద్దిలేటి స్వామి, కృష్ణమూర్తి, టీఈ నాగరాజు గౌడు, టీ.వెంకటేశ్వర్లు, కృష్ణమోహన్, ఆనంద్‌రావు, సురేంద్ర పాల్గొన్నారు.



కనిపించని సూచిక బోర్డులు

- నంద్యాల-ఒంగోలు ప్రధాన రహదారిలో తరచూ ప్రమాదాలు
- నల్లమల రహదారిలో ప్రాణాలు కోల్పోతున్న ప్రయాణికులు

నల్లమల అటవీప్రాంతం మీదుగా వెళ్లే నంద్యాల-ఒంగోలు ప్రధాన రహదారిలో పలుచోట్ల ప్రమాదకర మలుపులున్నాయి. కనీసం సూచిక, హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో వాహనాలు ప్రమాదాలకు గురువుతున్నాయి. దీంతో నల్లమలలో రహదారి రక్తసిక్తమవుతుండడంతో పలువురు వాహనదారులు ప్రాణాలు కోల్పోతున్నారు. నల్లమల ఘాట్ రోడ్డులో మలుపుల, కల్వర్టుల వద్ద ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఇలాంటి వాటిని గుర్తించి సరైన సూచనలు, గుర్తులు ఏర్పాటు చేయాల్సిన సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాహనదారులు ఆరోపిస్తున్నారు.


నంద్యాల-ఒంగోలు ప్రధాన రహదారిలో ప్రమాదకరమైన మలుపులు


రహదారి మలుపులో కానరాని సూచిక బోర్డులు

శిరివెళ్ల, జూలై 25(ఆంధ్రజ్యోతి) : నల్లమల ఘాట్‌లోని మలుపుల్లో తరచూ వాహన ప్రమాదాలు జరుగుతున్నాయి. గత ఐదేళ్ల వ్యవధిలో దాదాపు మూడు వందల ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఈ ఘటనల్లో వంద మంది వరకు మృతి చెందగా 500 మంది గాయాలపాలయ్యారు. నల్లమల అటవీప్రాంతం శిరివెళ్ల, మహానంది మండలాల్లోని గ్రామాల నుంచి ప్రకాశం జిల్లా సరిహద్దు వరకు విస్తరించి ఉంది. దట్టమైన రిజర్వు ఫారెస్టులో ఉన్న నంద్యాల-ఒంగోలు ప్రధాన రహదారి వెంట చాలా చోట్ల ప్రమాదకరమైన ఘాట్‌లు, మలుపులు ఉన్నాయి. ప్రయాణికులు ప్రమాద ప్రాంతాలను ముందుగా గుర్తించేందుకు అవసరమైన సూచిక, హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మలుపుల్లో ఉన్న కల్వర్టులను ఢీకొని వాహనాలు, ప్రయాణీకులు లోయలో పడి మృతి చెందిన ఘటనలున్నాయి.

అందని వైద్య సేవలు

శిరివెళ్ల మండల పరిధిలోని సర్వలక్ష్మీ నరసింహస్వామి ఆలయం నుంచి ప్రకాశం జిల్లాలోని దిగువమెట్ట గ్రామం వరకు రహదారి మొత్తం అటవీప్రాంతంలో ఉంది. దట్టమైన రిజర్వు ఫారెస్టు కావడంతో సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఉండవు. దీంతో ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులకు, 108 వాహనానికి తక్షణమే సమాచారం అందించే సదుపాయం లేదు. దీంతో అత్యవసర సమయంలో క్షతగాత్రులకు అందాల్సిన వైద్య సేవలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రహదారిలో అటువైపు వెళ్తున్న ఇతర ప్రయాణికులు అటవీ ప్రాంతం నుంచి బయటకు వచ్చాక మాత్రమే ప్రమాద ఘటనల గురించి హైవే పెట్రోలింగ్ సిబ్బందికి, పోలీసులకు సమాచారం అందించాల్సి వస్తోంది. రహదారిలో భారీ వాహనాలు బోల్తాపడినా, వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నా భారీగా ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. రాత్రి సమయాల్లో ప్రమాదాలు చోటు చేసుకుంటే అభయారణ్యంలో ప్ర యాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిందే. అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రహదారి నియమాలు పాటించాలి



వాహనదారులు తప్పనిసరిగా రహదారి నియమాలు పాటించాలి. అధిక లోడు, అతి వేగంతో ప్రయాణించే వాహనాలు మలుపుల వద్ద ప్రమాదాలకు గురవుతున్నట్లు గుర్తించాం. నల్లమల రహదారిలో పరిమిత వేగంతో మాత్రమే ప్రయాణించాలి. రహదారి ప్రమాదాలపై వాహనదారులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నాం.

- చిన్న పీరయ్య, ఎస్ఐ, శిరివెళ్ల

గిరిజన సంక్షేమ పాఠశాల తనిఖీ

ఆళ్లగడ్డ, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డలోని ఏపీ గిరిజన సంక్షేమ బాలుర పాఠశాలను జిల్లా న్యాయాధికారి అమ్మన్నరాజా శుక్రవారం తనిఖీ చేశారు. పాఠశాల భవనం పరిస్థితిని ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో తాత్కాలికంగా మరో భవనంలోనికి వసతి గృహాన్ని మారుస్తున్నట్లు ప్రిన్సిపాల్ వివరించారు. అనంతరం ఆళ్లగడ్డ సబ్ జైల్‌ను సందర్శించారు. కారాగారంలోని ముద్దాయిలతో సౌకర్యాల గురించి వైద్య సదుపాలయాల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ షెల్వంత్, సిబ్బంది పాల్గొన్నారు.


పాఠశాల భవనాన్ని పరిశీలిస్తున్న న్యాయాధికారి అమ్మన్నరాజా

దరఖాస్తులకు గడువు పొడిగింపు

డోన్ రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ ఆయా పోస్టుల దరఖాస్తు గడువు పొడిగించినట్లు సీడీపీవో శంషాద్ బేగం తెలిపారు. డోన్ మండలం చిన్నమల్కాపురం, తిరునాంపల్లె ప్యాపిలి మండలం ఊటకొండ, జక్కసానికుంట్ల, బేతంచెర్ల మండలం సిమెంటునగర్, బేతంచెర్లలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ఆయా పోస్టులకు ఈ నెల 31లోగా దరఖాస్తులు చేసుకోవచ్చని ఆమె సూచించారు. అర్హులైన అభ్యర్థులు పనివేళల్లో ఐసీడీఎస్ కార్యాల యంలో దరఖాస్తులు చేసుకోవాలని ఆమె తెలిపారు.

జిల్లా సమగ్రాభివృద్ధి కోసమే మహాసభలు

డోన్ రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్ర అభివృద్ధిని కోరుతూ ఈ నెల 30, 31 తేదీల్లో డోన్‌లో సీపీఐ జిల్లా రెండో మహా సభలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకయ్య, మోటరాముడు అన్నారు. పట్టణంలోని సుందర్‌సింగ్ కాలనీ లో విరాళాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు రణత్ యాదవ్, మహిళా సమాఖ్య నాయకురాళ్లు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే చంద్రబాబు ధ్యేయం

బేతంచెర్ల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని టీడీపీ రాష్ట్ర క్రిస్టియన్ సెల్ కార్యదర్శి మేకల నాగరాజు, జిల్లా ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి రూబెన్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని కోటపేట, కోటగిరిపేట ప్రాంతాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు తదితరులున్నారు.

విద్యార్థుల సామర్థ్యాలు పెంచాలి

ఉయ్యాలవాడ, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల సామర్థ్యాలను పెంచాలని ఎంఈవో-1 రఘురామిరెడ్డి సూచించారు. శుక్రవారం సర్వరాయపల్లెలోని రెగ్యులర్, స్పెషల్ ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ప్రశ్నలు వేసి జవాబు రాబట్టారు. ఆగస్టులో జరిగే ఎఫ్ఏ-1 పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలన్నారు. ఉపాధ్యాయులు వెంకటరమణ, ఖాద్రి ఉన్నారు.

డ్రైవర్లు లైసెన్సు కలిగి ఉండాలి

కోవెలకుంట్ల, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : డ్రైవర్లు తప్పకుండా లైసెన్సు కలిగి ఉండాలని కోవెలకుంట్ల సీఐ హనుమంతునాయక్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని జమ్మలమడుగు రహదారిలో సీఐ వాహనాలు తనిఖీ చేశారు. లైసెన్సులు, సర్టిఫికెట్లు లేని వాహనాలకు జరిమానావిధించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ వాహనాలు నడిపే డ్రైవర్లు తప్పకుండా లైసెన్సు, రికార్డులు కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మల్లికార్జున్‌రెడ్డి, పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.

అనారోగ్యంతో విద్యార్థిని మృతి

- ఆలస్యంగా వెలుగులోనికి వచ్చిన ఘటన
- మరో బాలికకూ అస్వస్థత
- విచారించిన అధికారులు

బేతంచెర్ల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె రహదారిలో ఉన్న కేజీబీవీ విద్యార్థిని అనారోగ్యంతో మృతిచెందింది. ఈఘటన ఆలస్యంగా వెలుగులోనికి వచ్చింది. వివరాలు.. కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో అంబాపురం గ్రామానికి చెందిన లలిత మాధురి అనే విద్యార్థిని 8వ తరగతి చదివేది. తీవ్ర అనారోగ్యానికి గురి కాగా తల్లి ఎన్.కుమారి వైద్య చికిత్సల నిమిత్తం ఇంటికి తీసుకెళ్లింది. వైద్యం చేయించినా ఆరోగ్యం నయం కాకపోవడంతో సోమవారం విద్యార్థిని మృతి చెందింది. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అలాగే గ్రామానికి చెందిన మధుమతి అనే 7వ తరగతి విద్యార్థిని కూడా అనారోగ్యంగా ఉండగా తండ్రి శ్రీనివాస్ యాదవ్ ఇంటికి తీసుకువచ్చి చికిత్స చేయించారని తెలిసింది. విషయం తెలిసిన వెంటనే తహసీల్దార్ నాగమణి, మండల విద్యాధికారి సోమశేఖర్, అధికారులు అంబాపురం గ్రామానికి వెళ్లి వివరాలు సేకరించారు. కేజీబీవీ పాఠశాలలో విద్యనభ్యసించే విద్యార్థినుల ఆలనా పాలనా ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పట్టించుకోకపోవడంతో అనారోగ్యాల పాలవుతున్నారని విద్యార్థినుల తల్లిదండ్రులు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. వ్యాధులు ముదిరిన తరువాత సమాచారం ఇస్తున్నారని వాపోతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేసి ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, విద్యార్థులు కోరుతున్నారు.

వైభవంగా శ్రావణమాస పూజలు

చాగలమర్రి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి, కోదండరామాలయాల్లో శుక్రవారం శ్రావణ మాస పూజలు వేద పండితుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. వెండిరథంలో అమ్మవారిని కొలువుదీరింప చేసి రథోత్సవం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ధర్మకర్త లక్ష్మణబాబు, కార్యదర్శి ప్రసాద్, మహిళలు పాల్గొన్నారు.


వాసవీమాత

తమలపాకులతో వాసవీమాత అలంకరణ

బనగానపల్లె: శ్రావణ తొలి శుక్రవారం సందర్భంగా పట్టణంలో శ్రీవాసవీమాత తమలపాకు అలంకరణంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు, మహిళలు అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే నందవరం చౌడేశ్వరీమాత పల్లకీసేవ సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో శ్రీనివాసరెడ్డి, ఛైర్మన్ పీవీ.కుమార్‌రెడ్డి, ఆలయ పూజారులు, భక్తులు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల : మండలంలోని శ్రావణ మాసం పూజలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఇళ్లలో, ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణమాసం ప్రారంభంతో మండలంలోని పలు ప్రముఖ ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది.

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ

ప్యాపిలి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ప్యాపిలికి చెందిన మోహన్‌బాబు తమ తల్లిదండ్రులు నరసమ్మ, గోవిందప్ప జ్ఞాపకార్థం స్థానిక బీసీ బాలుర వసతి భవనంలో శుక్రవారం విద్యార్థులకు ప్లేట్లు, పెట్టెలు, గ్లాసులు పంపిణీ చేశారు. వసతి భవనంలోని 75 మంది విద్యార్థులకు సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో వార్డన్ వెంకన్నగౌడు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి రహిత సమాజాన్ని నిర్మించడమే లక్ష్యం

డోన్ టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధి రహిత సమాజాన్ని నిర్మించడమే లక్ష్యమని డోన్ టీబీ యూనిట్ సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ ఈఏ అరుణ్ కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని సబ్ జైలులో టీబీ ముక్త్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సబ్‌జైలు ఖైదీలకు క్షయ వ్యాధి పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సబ్ జైలు సూపరింటెండెంట్ సురేష్, కరీముల్లా, ఉపేంద్ర, సుధాకర్, సుమలత, హరినాథ్, తదతరులు పాల్గొన్నారు.

నాడు వెలవెల .. నేడు కళకళ

- పశుపక్షాదులకు తీరుతున్న దాహం
- జిల్లాలో 250కి పైగా నూతన తొట్ల నిర్మాణం


గతంలో ఎండిపోయి శిథిలావస్థలో ఉన్న నీటి తొట్టి


మీర్జాపురంలో నూతనంగా నిర్మించిన నీటి తొట్టి

కొలిమిగుండ్ల, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పరిసరాల్లో పశుపక్షాదులకు దాహాన్ని తీర్చే నీటి తొట్లు గత వైసీపీ హయాంలో నిర్లక్ష్యానికి గురై వెలవెలబోయాయి. అయితే తిరిగి టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గ్రామీణ ప్రాంతాల్లో నీటి తొట్లు నిండు కుండల్లా కళకళలాడుతున్నాయి. పాడి పరిశ్రమపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్న ప్రభుత్వం శిథిలావస్థలో ఉన్న నీటి తొట్లను పునరుద్ధరించడంతో పాటు, ఈఏడాది నూతన తొట్లు నిర్మించడంతో పాడి రైతులు, పక్షులు, జంతు ప్రేమికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జిల్లా వ్యాప్తంగా 250కి పైగా నూతన పశువుల తొట్లు నిర్మించారు. ఒక్కో నీటి తొట్టికి రూ.40వేల నిధులు వెచ్చించి గ్రామ పరిసరాల్లో తొట్లు నిర్మించారు. దీంతో పశువులు, పక్షులు, ఇతర జంతువులకు ఇవి ఎంతో ఉపయోగకరంగా మారాయి.

చట్టాలపై అవగాహన ఉండాలి : ఎస్ఐ


మాట్లాడుతున్న ఎస్ఐ సురేష్‌నాయుడు

చాగలమర్రి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చట్టాలపై అవగాహన ఉండాలని ఎస్ఐ సురేష్‌నాయుడు అన్నారు. శుక్రవారం చాగలమర్రి వాసవీ జూనియర్ కళాశాలలో శక్తిటీమ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ ర్యాగింగ్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాల్య వివాహాలు, ఈవ్‌టీజింగ్‌పై అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకోరాదని సూచించారు. ఇష్టపడి చదివి ఉజ్వలభవిష్యత్తుకు ఎదగాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఓబులేసు, శక్తిటీమ్ సభ్యులు సుబ్బలక్ష్మి, బిలాల్, మహిళా పోలీసులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి

చాగలమర్రి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలు డెంగీ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని హెల్త్ అధికారి మనోహర్ తెలిపారు. శుక్రవారం చాగలమర్రి గ్రామంలోని పాతబస్టాండు సమీపంలో డ్రైడే, ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్ చంద్రకళ, ఆశాలు శివలక్ష్మి, సౌభాగ్యమ్మ ఉన్నారు.

పశు బీమాను వినియోగించుకోండి

చాగలమర్రి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రైతులు పశుబీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధకశాఖ ఏడీ వరప్రసాద్ తెలిపారు. శుక్రవారం చాగలమర్రి పశువైద్యశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పశువులకు సీజనల్ వ్యాధులు రాకుండా వ్యాక్సిన్ వేయించుకోవాలని అన్నారు. ముద్దచర్మ వ్యాధి నివారణకు ఎద్దులు, ఆవులకు టీకాలు వేయించాలన్నారు. పశువులకు వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పొంగి ప్రవహిస్తున్న కుందూ


రాజోలి ఆనకట్ట వద్ద పొంగి ప్రవహిస్తున్న కుందూ

చాగలమర్రి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎడతెరిపి లేకుండా మోస్తరు వర్షం కురిసింది. 13.4 ఎంఎం వర్షపాతం నమోదైంది. రాజోలి ఆనకట్ట వద్ద కుందూనది పొంగి ప్రవహించింది. కుందూలో 13 వేల క్యూసెక్కుల నీటితో ప్రవహిస్తున్నట్లు కేసీ కెనాల్ ఏఈ జమాల్‌వలి శుక్రవారం తెలిపారు. రాజోలి ఆనకట్ట నుంచి కేసీ కాలువకు 350 క్యూసెక్కుల నీరు విడుదల చేశామని అన్నారు. ఆనకట్టవద్దగల 5 గేట్లను ఎత్తి కడప జిల్లా వైపునకు వరద నీటిని విడుదల చేశామని అన్నారు. కురిసిన వర్షంతో వాడుముఖం పట్టిన పంటలకు జీవం పోసినట్లైందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

విద్యార్థికి అభినందన

చాగలమర్రి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని రాఘవేంద్ర ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న భరత్‌కుమార్ బనవాసిలోని నవోదయ పాఠశాలకు ఎంపికైనట్లు హెచ్ఎం సుదర్శన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం విద్యార్థి భరత్‌కుమార్, తండ్రి నరహరిని శాలువ, పూలమాలలతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ 2025 జనవరిలో జరిగిన నవోదయ పరీక్షా ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించి 6వ తరగతి ప్రవేశానికి ఎంపికయ్యారన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థికి బంగారు పతకం

బనగానపల్లె, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కడపలో నిర్వహించిన దక్షిణభారతదేశ స్థాయి కరాటే పోటీల్లో బనగానపల్లె మోడల్ స్కూల్ విద్యార్థి బాలాజీ బంగారు పతకం సాధించినట్లు ప్రిన్సిపాల్ రామలక్ష్మమ్మ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో పీడీ రాజాన్, కరాటే కోచ్‌లు సూర్యవంశీ, కళ్యాణ్‌బాల, ఉపాధ్యాయులు ఉన్నారు.

పచ్చిరొట్ట సాగు చేసుకోవాలి

రుద్రవరం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : రైతులు పంట పొలాల్లో పచ్చిరొట్ట సాగు చేసుకోవాలని వ్యవసాయాధికారి సుమతి సూచించారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ అధిక దిగుబడులు సాధించాలనే ఉద్దేశంతో పంట లకు అవసరం ఉన్నా లేకపోయినా రసాయనిక ఎరువులు అధికంగా వాడుతున్నారన్నారు. ఫలితంగా నేల నిస్సారంగా మారుతుందన్నారు. రైతులు పంట వేయడానికి ముందు పచ్చిరొట్ట సాగు చేసి కలియదున్నాలని సూచించారు. ఇలా చేయడంతో భూమిలో సారం పెరిగి అధిక దిగుబడులు సాధించొచ్చన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ

శిరివెళ్ల, జూలై 25(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పసులపేటలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి(నాగుల కట్ట) దేవతా విగ్రహ ప్రతిష్ఠ వేడుకలను నిర్వాహకులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేదమంత్రోచ్చరణాలు, మంగళవాయిద్యాల మధ్య విగ్రహ ప్రతిష్ఠ చేశారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం ఏర్పాటు చేసిన కోలాట ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది.

గుర్రం జాషువా రచనలు ఆదర్శనీయం

శిరివెళ్ల, జూలై 25(ఆంధ్రజ్యోతి) : ఆధునిక తెలుగు సాహిత్యంలో గుర్రం జాషువా రచనలు ఆదర్శనీయమైనవని వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని యర్రగుంట్ల గంగుల తిమ్మారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గుర్రం జాషువా వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. అధ్యాపకులు పున్నారావు, జనార్దనుడు, శ్రీనివాసరావు, కృష్ణమూర్తి, ఖాసీంసాహెబ్, సిబ్బంది శివ ప్రసాద్, గురు రమేష్ పాల్గొన్నారు.

నిరుపేదలకు బంగారు కుటుంబం వరం

రుద్రవరం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : పేదలకు బంగారు కుటుంబం పథకం ఒక వరమని సర్పంచ్ గుర్రం శాంతకుమారి అన్నారు. శుక్రవారం మండలంలోని నరసాపురం సచివాలయంలో స్పెషల్ ఆఫీసరు పీఆర్ ఏఈ కమాల్ సాహెబ్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. 113 కుటుంబాలను బంగారు కుటుంబాలుగా ఎంపిక చేశారు. పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, టీడీపీ నాయకులు శ్రీనివాసులు, బొప్ప ఫక్కీరయ్య గౌడ్, సూర పుల్లారెడ్డి, చిన్న మస్తాన్, మాజీ ఎంపీటీసీ బలరామిరెడ్డి, దస్తగిరిరెడ్డి, ఫక్కీరయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సర్పంచ్ శాంతకుమారి

టీడీపీ పాలనలోనే అభివృద్ధి

కోవెలకుంట్ల, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ పాలనలోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గడ్డం రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం కోవెలకుంట్లలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ వారు చేపట్టిన బాబు షూరిటీ మోసం గ్యారెంటీ అనే కార్యక్రమాన్ని తీవ్రంగా ఖండించారు. నాడు జగన్ పాలనంతా దుర్మార్గం, అరాచకమేనన్నారు. ప్రకృతి వనరులను దోచుకుని ధ్వంసం చేసి వేల కోట్లను అక్రమంగా దోచుకున్నారన్నారు. సీఎంగా చంద్రబాబునాయుడు బాధ్యతలు చేపట్టి 13 నెలలు అయిందని, అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం ప్రజలకు చేరువైందన్నారు.